www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 9014966169

Published from: Hyderabad, Karimnagar, Rangareddy, Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 38 | గురువారం | 10 సెప్టెంబర్, 2026

# ఫామ్‌హౌస్‌లోనే కుట్ర

## ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భేటీ నుంచి జరిగిన వరుస ఘటనలపై సమగ్ర విచారణ

- నేలను కాదు.. ఆలోచనలను శుద్ధి చేశాలి
- ఉగ్రవాదులకు, స్పీకర్‌ను తిట్టిన వారికి తేడా లేదు
- అంటరానితనం, కులవివక్షను ఉపేక్షించం..
- బాధ్యులపై క్రిమినల్ కేసులు
- ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధం
- బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారు
- స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదు
- బీఆర్ఎస్ తీరుపై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్
- విచారణ అధికారిగా హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్ నియామకం



ప్రజానావ. హైదరాబాద్: అసెంబ్లీలో స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదులకు, స్పీకర్‌ను దూషించిన వారికి తేడా లేదని వ్యాఖ్యానించారు. కులవివక్ష, అంటరానితనం, అణచివేత వంటి చర్యలను తమ ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. అసెంబ్లీ పరిసరాల్లో చోటుచేసుకున్న పరిణామాల వెనుక కుట్ర ఉందని ఆరోపించిన సీఎం.. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో జరిగిన భేటీ నుంచి వరుసగా చోటుచేసుకున్న ఘటనలన్నింటిపైనా సమగ్ర విచారణ జరిపిస్తామని తెలిపారు. అంటరానితనం ప్రదర్శించిన ఘటనపై విచారణ అధికా రిగా హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజయ్ కుమార్‌ను నియమిస్తున్నట్లు వెల్లడించారు. కుట్రకు రూపకల్పన చేసిన వారితో పాటు దాన్ని అమలు చేసిన వారినీ గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుం టామని పేర్కొన్నారు. బాధ్యులందరినీ కోర్టు ముందు దోషులుగా నిలబెట్టేలా విచారణ సాగుతుందని చెప్పారు.

### మూడు రోజుల ఘటనలపై దర్యాప్తు

ఫామ్‌హౌస్‌లో జరిగిన సమావేశం మొదలుకుని మూడు రోజులుగా చోటుచేసుకున్న వరుస పరిణామాలపై విచారణ చేపడతామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎక్కడి నుంచో ఆదేశాలు, సూచనలు ఇచ్చిన వారితో పాటు వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కుట్రధారులు, పాత్రధారులు ఎవ్వరినీ వదిలి పెట్టబోమని స్పష్టం చేశారు. అసెంబ్లీ వద్ద జరిగిన నిరసన సందర్భంగా మహిళలను ఇబ్బందులకు గురిచేసిన ఘటనపైనా విచారణ చేపడుతున్నామని సీఎం తెలిపారు. విధుల్లో ఉన్న పోలీసు, ఇతర సిబ్బందిపై జరిగిన దాడులకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నామని చెప్పారు. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేసి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### తల్లిని అవమానిస్తారా?

రాష్ట్రంలో కేసీఆర్ ఫామ్‌హౌస్ రోడ్డును శుద్ధి చేసిన ఘటనను సీఎం ప్రస్తావించారు. ఫామ్‌హౌస్‌లో విపక్ష నేత కేసీఆర్ ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించిన అనంతరం చోటుచేసుకున్న పరిణామాలపై ప్రశ్నలు లేవనెత్తారు. అసెంబ్లీ ముందు విధుల్లో ఉన్న మహిళా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయడంతో పాటు, దళితుడైన స్పీకర్‌ను అవమానించేలా దూషణలు చేశారని ఆరోపించారు. రాజకీయంగా ఎన్ని విభేదాలైనా ఉండొచ్చని, అయితే వ్యక్తిగతంగా, ముఖ్యంగా తల్లిని అవమానించడం ఎంతవరకు సమంజసమని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. స్పీకర్‌కు క్షమాపణలు చెప్పి తప్పును సరిదిద్దుకోవాలని అన్ని పార్టీలు సూచించిన విషయాన్ని గుర్తుచేశారు.

### మరో కుట్రకు ఆదేశించారన్న సీఎం

స్పీకర్‌ను అవమానించినందుకు ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని రేవంత్‌రెడ్డి అన్నారు. దీనికి నిరసనగా ఎస్సీ వర్గాల ప్రజలు డప్పులతో నిరసన తెలిపారని చెప్పారు. ఫామ్‌హౌస్‌కు దూరంగా డప్పులు మోగిస్తూ నిరసన తెలిపారే తప్ప ఎవరినీ దూషించలేదని, దాడులకు పాల్పడలేదని పేర్కొన్నారు. దళిత సమాజానికి క్షమాపణలు చెప్పాలని మాత్రమే వారు డిమాండ్ చేశారని సీఎం తెలిపారు. అయితే క్షమాపణలు చెప్పకుండా మరో కుట్రకు ఆదేశించారని ఆరోపించారు. కేసీఆర్ ఆదేశాల మేరకే ఫామ్‌హౌస్ రోడ్డును శుద్ధి చేశామని బీఆర్ఎస్ నేత సంధ్యారావు సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారని తెలిపారు. పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన నాయకుడు ఇలాంటి చర్యలకు పాల్పడటం సమంజసమేనా? అని ప్రశ్నించారు.

### నేలను కాదు.. ఆలోచనలను శుద్ధి చేయాలి

దళితులు నడిచారని నేలను శుద్ధి చేయడం కాదని, సమాజంలో పాతుకుపోయిన అంటరానితనం, కుల వివక్ష భావాలను శుద్ధి చేయాల్సిన అవసరం ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న వివక్ష, అణచివేత ఆలోచనలను తొలగించాలని సూచించారు. దళితులు నడిచిన నేలను శుద్ధి చేయించిన అహంకార ధోరణిని సమాజం నుంచి తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. దళితులను అవమానించిన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మల్లికార్జున ఖర్గే, ప్రసాద్‌కుమార్‌కు జరిగిన అవమానాలు వ్యక్తిగతంగా జరిగినవి కావని.. కులవివక్ష, అణచివేతకు సంబంధించిన అంశాలని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను ప్రజా ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.



## 19 ఏళ్ల క్రితం పట్టాలు
# స్థలాలు ఎక్కడ?

- పేదల భూమిలో మార్కెట్ యార్డు నిర్మాణ యత్నం సరికాదు
- స్థలాలు చూపించే వరకు ఉద్యమిస్తాం: కవిత

ప్రజానావ, హైదరాబాద్: మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ రెవెన్యూ గ్రామంలో 19 ఏళ్ల క్రితం పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చి, ఇప్పటికీ వారికి స్థలాలు కేటాయించకపోవడం తీవ్ర అన్యాయమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు కేటాయించిన స్థలాలను చూపించాలంటూ పేదలు 75 రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ప్రభుత్వ తీరుపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 19 ఏళ్ల క్రితం పేదలకు పట్టాలు ఇచ్చిన భూమిలోనే ఇప్పుడు మార్కెట్ యార్డు నిర్మించేందుకు ప్రయత్నించడం సరికాదని స్పష్టం చేశారు. పేదలకు పట్టాలు ఇచ్చి దాదాపు రెండు దశాబ్దాలుగా స్థలాలు చూపించకపోవడం గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. హిమాయత్‌నగర్ రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 151లో 2007లో 290 మంది పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారని గుర్తుచేశారు. పట్టాలు చేతిలో ఉన్నప్పటికీ ఇప్పటివరకు స్థలాలు చూపించకపోవడంతో వారు ఇళ్లు నిర్మించుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాం నుంచి తెలంగాణ ఏర్పడిన అనంతరం బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల వరకు పట్టాదారులు పలుమార్లు అధికారులను కలిసి సమస్యను పరిష్కరించాలని కోరినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. ఇప్పుడు అదే సర్వే నంబర్‌లో మార్కెట్ యార్డు నిర్మించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. తమకు కేటాయించిన స్థలాల్లో మార్కెట్ యార్డు నిర్మించవద్దని, పట్టాల్లో పేర్కొన్న స్థలాలను చూపిస్తే తామే ఇళ్లు నిర్మించుకుంటామని పేదలు 75 రోజులుగా దీక్షలు చేస్తున్నారని కవిత వెల్లడించారు. ప్రభుత్వం ఇకనైనా వారి ఆందోళనను గుర్తించి వెంటనే స్థలాలను చూపించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పేదల హక్కుల కోసం తెలంగాణ రక్షణ సేన అండగా నిలుస్తుందని, వారికి కేటాయించిన ఇళ్ల స్థలాలు చూపించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని కవిత స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ సభ్యులపై వేటు



- సభ ముగిసే వరకు సస్పెన్షన్
- 'వియ్ వాంట్ జస్టిస్' అంటూ సభలో ఆందోళన
- కేటీఆర్, హరీశ్‌రావు సహా 19 మంది సభ్యుల సస్పెన్షన్
- స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ సభ్యులను అడ్డుకున్న మార్షల్స్
- 'దొరతనం పోకడలను భరించేందుకు రాష్ట్రం సిద్ధంగా లేదు'
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

## 420 హామీలు.. అమలు సున్నా!

- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై గవర్నర్‌కు ఫిర్యాదు
- రైతులు, నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసింది
- తమపై దాడులు చేసి.. తమపైనే కేసులు పెట్టారు
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్
- ఎమ్మెల్యేలపై పోలీసుల దాడులకు ఆధారాలు సమర్పించిన బీఆర్ఎస్

2





## తెలంగాణలో బీజేపీదే
# అధికారం

వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయం..
మా గెలుపును ఏ శక్తీ అడ్డుకోలేదు

- యూపీ ఎన్నికల తర్వాత తెలంగాణపై అధిష్ఠానం దృష్టి
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది
- కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి.. కేసులకు భయపడొద్దు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

ప్రజానావ, భద్రాచలం: తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ విజయాన్ని ఏ శక్తీ అడ్డుకోలేదని అన్నారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన అనంతరం పార్టీ అధిష్ఠానం పూర్తిగా తెలంగాణపై దృష్టి సారిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో అధికారాన్ని సాధించడమే పార్టీ తదుపరి లక్ష్యమని పేర్కొన్నారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఓ కాంగ్రెస్ మంత్రి తరువాయి 2లో



## బీఆర్ఎస్ 'శుద్ధీకరణ'పై
# గవర్నర్‌కు ఫిర్యాదు

2

- స్పీకర్, ఆయన తల్లిని దూషించడం దుర్మార్గం
- దళితులు నడిచిన రోడ్డును శుద్ధి చేయించడం అంటరానితనమే
- కులవివక్షకు ప్రజాపాలనలో తావులేదు.. చర్యలు తప్పవు: మంత్రులు
- కేసీఆర్ ఆదేశాలతోనే ఇదంతా జరిగిందా?: అడ్లూరి లక్ష్మణ్

## హాస్టళ్లకు హైడ్రా అల్టిమేటం




- జనవరి 1 నుంచి తనిఖీలు.. అనుమతులు లేని, ప్రమాదకర భవనాల్లో హాస్టళ్లకు చెక్
- 3 నెలల్లో సురక్షిత భవనాలకు మార్చాలని ఆదేశం
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- అగ్నిమాపక భద్రత, అత్యవసర మార్గాలు తప్పనిసరి
- హైడ్రా కమిషనర్ రంగనాథ్

2

## 22ఏపై చర్చ ఎప్పుడో చెప్పాలి!

- అప్పటివరకు మా ఆందోళన కొనసాగుతుంది
- సభలో లేని సభ్యులను ఎలా సస్పెండ్ చేస్తారు?
- బీఏసీలో నిర్ణయించిన ప్రకారమే సభ నడపాలి
- బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

2






## 9/11కి ముందే హెచ్చరిక సంకేతాలు!

- దాడికి రెండు వారాల ముందే 'గద్ద తలను విరిచేయబోతున్నాం' అనే సందేశం
- సెప్టెంబరు 10న 'అతిపెద్ద మ్యాచ్.. జీరో అవర్' అంటూ మరో మెసేజ్
- దాడి జరిగిన మరుసటి రోజు వరకు సందేశాలను డీకోడ్ చేయని నిఘా వర్గాలు
- మే–జులై మధ్య 33 సార్లు అనుమానాస్పద సంభాషణలు గుర్తించిన ఎన్ఎస్ఏ

2

## రైలు మార్గాల విస్తరణకు
# కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- ఘట్‌కేసర్-కాజీపేట నాలుగో లైన్‌కు కేబినెట్
- 110 కి.మీ. ప్రాజెక్టుకు రూ.2,419 కోట్లు.. అరక్కోణం-రేణిగుంటలో 3, 4వ లైన్లు
- నాలుగు రాష్ట్రాల్లో ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు రూ.10,021 కోట్ల అంచనా
- 2029-30 నాటికి పనులు పూర్తి చేసేలా ప్రణాళిక
- కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్

2

# తెలంగాణలో బీజేపీదే అధికారం

(మొదటి పేజీ తరువాయి)

అక్రమ మార్గాల్లో ఢిల్లీకి డబ్బులు పంపుతున్నారని బండి సంజయ్ ఆరోపించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేసి వేధించారని విమర్శించారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను ఆయన వెల్లడించలేదు.

### కేంద్ర పథకాలను తమవిగా ప్రచారం

కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహకారంతో అమలు చేస్తున్న ఉచిత సన్నబియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తన పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బండి సంజయ్ విమర్శించారు. కేంద్ర నిధులతో అమలవుతున్న పథకాలపై ప్రజలకు వాస్తవాలను వివరించాలని కార్యకర్తలకు సూచించారు.

### 'అక్రమ కేసులకు భయపడొద్దు'

గతంలో కేసీఆర్ ప్రభుత్వ పాలనను ఎదుర్కొని బీజేపీ పోరాడిందని బండి సంజయ్ గుర్తుచేశారు. తనపై 109 అక్రమ కేసులు నమోదైనా వెనకడుగు వేయలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. పోలీసు కేసులకు భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

### కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత

దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. తెలంగాణలోనూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు పట్టం కట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

# 22ఏపై చర్చ ఎప్పుడో చెప్పాలి!



**ప్రజానావ, హైదరాబాద్:** శాసనసభలో 22ఏ అంశంపై చర్చ ఎప్పుడు చేపడతారో స్పష్టంగా ప్రకటించాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అప్పటివరకు తమ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. శాసనసభలో మాట్లాడిన ఆయన.. సభలో లేని సభ్యులను స్పీకర్ సస్పెండ్ చేయడం బాధాకరమని అన్నారు. ఏ నిబంధనల ప్రకారం వారిని సస్పెండ్ చేశారో స్పష్టం చేయాలని ప్రశ్నించారు.

### బీఏసీ నిర్ణయాల మేరకు సభ నడపాలి

బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో నిర్ణయించిన విధంగానే శాసనసభ కార్యకలాపాలను కొనసాగించాలని మహేశ్వర్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలో అనేక కీలక సమస్యలు ఉన్నాయని, వాటిపై సభలో సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. 22ఏ అంశంపై చర్చకు స్పష్టమైన సమయం ప్రకటించాలని పట్టుబట్టారు.

### బీఆర్ఎస్ సస్పెన్షన్ పునఃసమీక్షించాలి

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌ను పునఃసమీక్షించాలని కోరారు. సస్పెండ్ చేసిన సభ్యులను తిరిగి సభకు హాజరయ్యేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. సభ సజావుగా సాగేందుకు ప్రభుత్వం, ప్రతిపక్షాలు చర్చల ద్వారా పరిష్కారం కనుగొనాలని సూచించారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్‌పైనా చర్చకు డిమాండ్

ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు 22ఏ తదితర అంశాలపై శాసనసభలో చర్చ చేపట్టాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. విద్యార్థులకు సంబంధించిన సమస్యలతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రజా సమస్యలపై కూడా సభలో చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు.

# మసూద్ అజర్ అఫ్గాన్‌లో లేడు:తాలిబన్

- పాక్ వాదనలకు తెరదించిన కాబూల్
- జైషే మహ్మద్ చీఫ్ తమ దేశంలో లేడని స్పష్టీకరణ
- తమ భూభాగాన్ని ఇతర దేశాలపై దాడులకు వినియోగించబోమని వెల్లడి
- అజర్ పాక్‌లోనే ఉన్నాడన్న వాదనలకు తాజా ప్రకటనతో బలం



**కాబూల్:** జైషే మహ్మద్ అధినేత మసూద్ అజర్ అఫ్గానిస్థాన్‌లో ఉన్నాడంటూ పాకిస్థాన్ చేస్తున్న వాదనలకు తాలిబన్ ప్రభుత్వం తెరదించింది. మసూద్ అజర్ తమ దేశంలో లేదని అఫ్గానిస్థాన్ విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. తమ భూభాగాన్ని ఇతర దేశాలపై దాడులకు ఉపయోగించుకోనివ్వబోమని మరోసారి తేల్చి చెప్పింది. 2019లో పుల్వామా దాడితో పాటు పలు ఉగ్రవాద ఘటనల్లో మసూద్ అజర్ కీలక పాత్ర పోషించినట్లు భారత్ ఆరోపిస్తోంది.

### ఎఫ్ఏటీఎఫ్ ఒత్తిళ్ల నేపథ్యంలో..

ఉగ్రవాద సంస్థలపై చర్యలు తీసుకోవాలన్న అంతర్జాతీయ ఒత్తిడితో పాటు ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) నుంచి ఎదురైన ఇబ్బందులను అధిగమించేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తూ వస్తోంది. ఈ క్రమంలో మసూద్ అజర్ 2019 మేలో డ్యూరాండ్ రేఖ దాటి అఫ్గానిస్థాన్‌కు వెళ్లిపోయాడని పాక్ తరచూ చెబుతూ వస్తోంది.

### పాక్ వాదనకు భిన్నంగా..

ఉగ్రవాద సంస్థలకు నిధుల సరఫరాను అరికట్టడంలో వైఫల్యాల నేపథ్యంలో పాకిస్థాన్ 2018 నుంచి 2022 వరకు ఎఫ్ఏటీఎఫ్ 'గ్రే' లిస్ట్‌లో కొనసాగింది. తాజాగా మసూద్ అజర్ తమ దేశంలో లేదని తాలిబన్ ప్రభుత్వం ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో అతడు పాకిస్థాన్‌లోనే ఉన్నాడన్న వాదనలకు మరింత బలం చేకూరుతున్నట్లు విశ్లేషణలు వెలువడుతున్నాయి.

# హాస్టళ్లకు హైడ్రా అల్టిమేటం

**ప్రజానావ, హైదరాబాద్:** నగరంలోని హాస్టళ్ల భద్రతపై హైడ్రా కఠిన చర్యలకు సిద్ధమైంది. అనుమతులు లేని, సురక్షితం కాని భవనాల్లో నిర్వహిస్తున్న హాస్టళ్లను మూడు నెలల్లోగా సురక్షిత భవనాలకు మార్చాలని నిర్వాహకులకు స్పష్టం చేసింది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి హాస్టళ్లపై తనిఖీలు ప్రారంభిస్తామని, నిబంధనలకు విరుద్ధంగా ప్రమాదకర భవనాల్లో హాస్టళ్లు నిర్వహిస్తున్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు.




### భద్రతలో రాజీ వద్దు

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధ్యక్షతన హాస్టళ్ల నిర్వాహకులు, భవన యజమానులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, ఉద్యోగుల భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని స్పష్టం చేశారు. ప్రతి హాస్టల్‌లో అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, భవన నిర్మాణ పటిష్ఠత తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

అనుమతులు లేకుండా, ప్రమాదకర భవనాల్లో హాస్టళ్లు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని రంగనాథ్ హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రమాదకర భవనాలను కూల్చివేసే చర్యలు చేపడతామని తెలిపారు. అనుమతులు లేని భవనాలపై క్షేత్రస్థాయి తనిఖీల కోసం మూడు మున్సిపల్ కార్పొరేషన్లతో సమన్వయం చేసుకుంటామని వెల్లడించారు.

### ఘటనల నేపథ్యంలో నిర్ణయం

ఇటీవల గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం కూలి ఇద్దరు మృతి చెందడం, ఢిల్లీలో హాస్టల్ భవనం కూలి పలువురు ప్రాణాలు కోల్పోవడం వంటి ఘటనలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు హైడ్రా తెలిపింది. కేవలం లాభాల కోసం హాస్టల్ వాసుల భద్రతను విస్మరించవద్దని నిర్వాహకులకు రంగనాథ్ సూచించారు. హాస్టళ్లలో ఉంటున్న వారిని తమ సొంత పిల్లల్లా భావించి తగిన భద్రతా వసతులు కల్పించాలని కోరారు.

### ఫైర్ సేఫ్టీపై అవగాహన

సమావేశంలో హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య అగ్నిప్రమాదాల నివారణ చర్యలు, ఫైర్ సేఫ్టీ నిబంధనలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. వీడియోల ద్వారా భద్రతా ప్రమాణాలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు.



# రోడ్డును శుద్ధి చేయడం దారుణం

## మంత్రి వాకిటి శ్రీహరి

**ప్రజానావ, హైదరాబాద్:** దళితులు నడిచారని రోడ్డును శుద్ధి చేయడం దారుణమైన ఘటన అని తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. అస్పృశ్యత విధానం ఇంకా కొనసాగుతుండటం బాధాకరమని చెప్పారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. ''స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా, విద్యతో చైతన్యం పెరిగినా కొందరి భావజాలం మారలేదు. ఇలాంటి అహంకారపూరిత వ్యక్తులు, పార్టీని ప్రజలు సహించరు. భూతల్లిని కాదు.. అస్పృశ్యత నాటుకుపోయినా వాళ్ల మనసులను శుద్ధి చేయాలి. మహిళా ఉద్యోగుల ముందు దుస్తులు విప్పటం చూసి సభ్యసమాజం తలదించుకుంటోంది. కేసీఆర్ సభకు వచ్చి సలహాలు, సూచనలు ఇవ్వాలని సీఎం ఎన్నోసార్లు ఆహ్వానించారు'' వాకిటి శ్రీహరి అన్నారు.



# రైలు మార్గాల విస్తరణకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

**న్యూఢిల్లీ:** రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రైళ్ల రాకపోకలను మరింత వేగవంతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని రద్దీ మార్గాలతో పాటు దేశవ్యాప్తంగా పలు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం వెల్లడించారు.ఘట్‌కేసర్–కాజీపేటకు నాలుగో లైన్‌తెలంగాణలోని ఘట్‌కేసర్–కాజీపేట రైల్వే సెక్షన్‌లో నాలుగో లైన్ నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 110 కిలోమీటర్ల మేర చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.2,419 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈ లైన్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్–కాజీపేట మార్గంలో రైళ్ల రాకపోకల సామర్థ్యం మరింత పెరగనుంది.అరక్కోణం–రేణిగుంటలో రెండు కొత్త లైన్లుఆంధ్రప్రదేశ్ మీదుగా సాగే అరక్కోణం–రేణిగుంట మార్గంలో 3వ, 4వ లైన్ల నిర్మాణానికీ కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ మార్గంలో అదనపు లైన్లు అందుబాటులోకి రావడంతో రైళ్ల రాకపోకలకు మరింత వెసులుబాటు కలగనుంది. రద్దీ మార్గాల్లో రైళ్లను సులభంగా నిర్వహించేందుకు ఈ ప్రాజెక్టులు దోహదపడనున్నాయి. నాలుగు రాష్ట్రాల్లో ఐదు ప్రాజెక్టులుతెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని 17 జిల్లాల పరిధిలో మొత్తం ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులను చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. వీటి కోసం సుమారు రూ.10,021 కోట్లను వెచ్చించనున్నట్లు తెలిపింది. కొత్త రైల్వే లైన్ల నిర్మాణంతో ప్రయాణికుల రైళ్లతో పాటు సరుకు రవాణా రైళ్ల నిర్వహణ సామర్థ్యం కూడా పెరగనుంది.వేగం పెరగనున్న రైళ్లమల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు పూర్తయితే రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగడంతో పాటు రద్దీ మార్గాల్లో రైళ్ల వేగం, రాకపోకల సామర్థ్యం మెరుగుపడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సరుకు రవాణా మరింత సమర్థంగా సాగేందుకు కూడా ఈ ప్రాజెక్టులు ఉపయోగపడనున్నాయి. 2029–30 నాటికి పనులను పూర్తి చేసేలా కేంద్రం ప్రణాళిక రూపొందించింది.

# బీఆర్ఎస్ సభ్యులపై వేటు

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో బీఆర్ఎస్ సభ్యులపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు బీఆర్ఎస్‌కు చెందిన 19 మంది ఎమ్మెల్యేలను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రతిపాదన మేరకు స్పీకర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. మూడో రోజు సభ ప్రారంభమైన వెంటనే బీఆర్ఎస్ సభ్యులు 'వియ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు అడ్డుతగిలారు. దీంతో వారిని సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. స్పీకర్ ఆ ప్రతిపాదనను ఆమోదించి సస్పెన్షన్ ప్రకటించారు.



### 19 మంది సభ్యుల సస్పెన్షన్

సస్పెండ్ అయిన వారిలో కేటీఆర్, హరీశ్‌రావు, పాడి కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, ప్రశాంత్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, విజయుడు, జగదీశ్‌రెడ్డి, అనిల్ జాదవ్, సుధీర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, గంగుల కమలాకర్, సబితా ఇంద్రారెడ్డి, కోవా లక్ష్మి , సునీత లక్ష్మారెడ్డి ఉన్నారు. సస్పెన్షన్ అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు బీఆర్ఎస్ సభ్యులు ప్రయత్నించగా.. వారిని మార్షల్స్ అడ్డుకున్నారు.

### 'అవమానాలు మానుకోవాలి'

బీఆర్ఎస్ నేతలు సభాపతికి చేయాల్సిన అవమానాలన్నీ చేశారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. సభాపతి సూచనలు పాటిస్తూ సభా కార్యకలాపాలు సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు. వెల్‌లోకి వచ్చి నిరసనలు తెలపడంతో పాటు స్పీకర్‌పై సవాళ్లు విసరడం సరికాదన్నారు. ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించొద్దని బీఆర్ఎస్ సభ్యులకు సూచించారు. రాష్ట్రంలో విభజన, విద్వేషాలను పెంచే ప్రయత్నాలు మంచివి కావని అన్నారు.

### 'న్యాయం కావాల్సింది బలహీనవర్గాలకే'

స్పీకర్‌తో పాటు ఆయన తల్లిని దూషించిన ఘటనకు నిరసనగా దళితులు ఆందోళన చేపట్టారని భట్టి తెలిపారు. దళితులు రోడ్డుపై నడిచిన ప్రాంతాన్ని పసుపు నీటితో శుద్ధి చేయడం అవమానకరమని విమర్శించారు. అలాంటి ఘటనలతో బాధపడుతున్న బలహీనవర్గాలు, దళితులు, గిరిజనులకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. విపక్ష నేతల ఆగడాలు, అవమానాలను ప్రభుత్వం సంయమనంతో భరిస్తోందని భట్టి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని విపక్ష నేతలు ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. దొరతనం, అహంకార పోకడలను భరించేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా లేరని స్పష్టం చేశారు.

# 420 హామీలు.. అమలు సున్నా!

**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి, కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలు, రైతులు, నిరుద్యోగుల సమస్యలతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై జరిగిన పోలీసుల దాడులపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్లు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. గవర్నర్‌ను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని గవర్నర్‌కు వివరించినట్లు కేటీఆర్ తెలిపారు. వంద రోజుల్లో అన్ని హామీలు అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చి.. వివిధ డిక్లరేషన్లు, బాండ్ పేపర్లు, అఫిడవిట్ల పేరుతో 420 హామీలు ఇచ్చారని ఆరోపించారు.



### రైతులకు భరోసా ఏది?

గతంలో రైతుబంధు పథకం కింద రూ.73 వేల కోట్లు అందించామని, ప్రస్తుత ప్రభుత్వం రైతులకు కనీసం యూరియా కూడా సక్రమంగా అందించలేకపోతోందని కేటీఆర్ ఆరోపించారు. రైతుబీమా విషయంలోనూ ప్రభుత్వం విఫల మైందని విమర్శించారు. రైతులకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం వారిని ఇబ్బందులకు గురిచేస్తోందని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

### నిరుద్యోగులను మోసం చేశారు

రాష్ట్రంలోని నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరుపైనా గవర్నర్‌కు వివరించామని కేటీఆర్ తెలిపారు. ఉద్యోగాల విషయంలో యువతను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

### పోలీసుల దాడులకు ఆధారాలు

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా నల్లరంగు టీషర్టులు ధరించి అసెంబ్లీకి వెళ్లామని కేటీఆర్ తెలిపారు. తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేసిన తీరుకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు సమర్పించామని చెప్పారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై జరిగిన పోలీసుల దాడి, అవమానానికి సంబంధించిన ఆధారాలను కూడా అందజేశామని వెల్లడించారు. తమపై దాడులు చేసిన తర్వాత తిరిగి తమపైనే కేసులు నమోదు చేశారని కేటీఆర్ ఆరోపించారు. దాడులపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయలేదని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరినట్లు కేటీఆర్ వెల్లడించారు.

# బీఆర్ఎస్ 'శుద్ధీకరణ'పై గవర్నర్‌కు ఫిర్యాదు

**ప్రజానావ, హైదరాబాద్:** అసెంబ్లీ తొలిరోజు చోటుచేసుకున్న వివాదాలు, బీఆర్ఎస్ నేతలు చేపట్టినట్లు ఆరోపిస్తున్న 'శుద్ధీకరణ' ఘటనపై రాష్ట్ర మంత్రులు గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు ఫిర్యాదు చేశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను కలిశారు. అసెంబ్లీలోకి ప్రవేశించే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరుతో పాటు స్పీకర్‌ను అవమానించేలా చేసిన వ్యాఖ్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఉన్నారు.

### 'దొర అహంకారానికి నిదర్శనం'

బీఆర్ఎస్ నేతలు దొర అహంకారంతో వ్యవహరిస్తున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు. శాసనసభ స్పీకర్, ఆయన తల్లిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు దూషించారని ఆరోపించారు. దీనిని నిరసిస్తూ కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళితులు డప్పులతో శాంతియుతంగా నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేయించడం దళిత వ్యతిరేక వైఖరికి నిదర్శనమని అన్నారు. ఈ రెండు ఘటనలపైనా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు గవర్నర్‌కు వివరించినట్లు అడ్లూరి తెలిపారు.

### 'దళితులపై అంటరానితనమేనా?'

దళితులు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపితే వారిని అవమానించారని, దళితులు తన ఫామ్‌హౌస్ రోడ్డులో నడిచారనే కారణంతో దానిని శుద్ధి చేయించారని అడ్లూరి లక్ష్మణ్ ఆరోపించారు. ఈ చర్యలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.స్పీకర్, ఆయన తల్లిని బీఆర్ఎస్ నేతలు దూషించిన ఘటనపైనా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. దళితులను అవమానించడంపై కేసీఆర్ ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఆదేశాలతోనే ఈ చర్యలు జరుగుతున్నాయా? ఆయన ఆదేశాలు లేకపోతే దీనిపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

### కులవివక్షను సహించం

బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు చేసిన ఫిర్యాదుపై స్పీకర్ స్పందించారని అడ్లూరి తెలిపారు. ఘటనపై విచారణకు ఆదేశించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పీకర్ హామీ ఇచ్చినట్లు చెప్పారు. ప్రజాపాలనలో అంటరానితనానికి, కులవివక్షకు ఎలాంటి చోటు లేదని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలను ప్రభుత్వం సహించబోదని హెచ్చరించారు.

# 9/11కి ముందే హెచ్చరిక సంకేతాలు!

**వాషింగ్టన్:** అమెరికాను కుదిపేసిన 9/11 ఉగ్రదాడికి 25 ఏళ్లు పూర్తికానున్న నేపథ్యంలో.. నాటి ఘటనకు సంబంధించి పలు కీలక అంశాలు మరోసారి చర్చకు వస్తున్నాయి. 2001 సెప్టెంబరు 11న అల్‌ఖైదా జరిపిన దాడుల్లో దాదాపు 3 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే ఈ దాడికి కొన్ని రోజుల ముందే అమెరికా నిఘా సంస్థలకు అనుమానాస్పద సందేశాలు, హెచ్చరిక సంకేతాలు అందినట్లు తాజాగా వెలుగులోకి వచ్చిన వివరాలు పేర్కొంటున్నాయి.



### 'గద్ద తలను విరిచేయబోతున్నాం'

2001 ఆగస్టు 27న మాడ్రిడ్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న అల్‌ఖైదా సభ్యుడి టెలిఫోన్ సంభాషణను అమెరికా నిఘా వర్గాలు గుర్తించినట్లు సమాచారం. అందులో 'గద్ద తలను విరిచేయబోతున్నాం' అనే అర్థం వచ్చే సందేశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఆ సందేశం వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని అప్పట్లో నిఘా సంస్థలు స్పష్టంగా గుర్తించలేకపోయినట్లు సమాచారం.

### 'అతిపెద్ద మ్యాచ్ జరగబోతోంది'

సెప్టెంబరు 10న అనుమానిత ఉగ్రవాదులపై నిఘా కొనసాగిస్తున్న సమయంలో 'మ్యాచ్ మొదలవబోతోంది' అనే సందేశాన్ని ఎన్ఎస్ఏ గుర్తించినట్లు సమాచారం. అదే రోజు అఫ్గానిస్థాన్‌లోని ఓ రహస్య ప్రాంతం నుంచి మరో సందేశం అందినట్లు తెలుస్తోంది. 'రేపే అతిపెద్ద మ్యాచ్ జరగబోతోంది.. అది జీరో అవర్‌గా మారనుంది' అనే అర్థం వచ్చేలా ఆ సందేశం ఉన్నట్లు పేర్కొంటున్నారు. అయితే ఈ రెండు సందేశాలను ఎన్ఎస్ఏ దాడి జరిగిన మరుసటి రోజు.. సెప్టెంబరు 12న డీకోడ్ చేసినట్లు సమాచారం. అప్పటికే అమెరికాలో భీకర ఉగ్రదాడి చోటుచేసుకుంది.

### ముందే 33 హెచ్చరికలు?

2001 మే నుంచి జులై మధ్యకాలంలోనూ ఉగ్రదాడి జరిగే అవకాశం ఉందన్న సంకేతాలు ఇచ్చే సంభాషణలను ఎన్ఎస్ఏ దాదాపు 33 సార్లు గుర్తించినట్లు సమాచారం. అయితే అవి ఎప్పుడు, ఎక్కడ జరుగుతాయనే విషయంపై అమెరికా నిఘా వర్గాలకు స్పష్టత రాలేదని తెలుస్తోంది. ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో 2001 జులై 4న నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అమెరికా భద్రతను కట్టుదిట్టం చేసింది. అయితే ఆ వేడుకలు ముగిసిన దాదాపు రెండు నెలలకే సెప్టెంబరు 11న అమెరికా చరిత్రలోనే అత్యంత విషాదకరమైన ఉగ్రదాడుల్లో ఒకటి చోటుచేసుకుంది. ఈ ఘటనలో దాదాపు 3 వేల మంది ప్రాణాలు కోల్పోయారు.

### రష్యా పోలీసుల అదుపులో నుంచి

# ఇంజినీర్ చందన్ గుప్తా విడుదల



**కాన్పూర్:** రష్యా పోలీసులు అదుపులోకి తీసుకున్న ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఇంజినీర్ చందన్ గుప్తా విడుదలయ్యారు. ఆయన సురక్షితంగా ఇంటికి చేరుకున్నట్లు భార్య స్నేహ వీడియో సందేశం ద్వారా ధ్రువీకరించారు. ఈ క్లిష్ట సమయంలో తన భర్త పనిచేస్తున్న కంపెనీ అండగా నిలిచిందని ఆమె తెలిపారు. తన ఆందోళనలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సహకరించిన భాజపా ఎంపీ సీమా ద్వివేదీతో పాటు ఇతరులకు కృతజ్ఞతలు తెలిపారు.

### వర్క్ వీసాపై రష్యాకు..

ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన చందన్ గుప్తా కొన్నేళ్ల క్రితం ఉద్యోగరీత్యా వర్క్ వీసాపై రష్యాకు వెళ్లారు. అక్కడే భార్య స్నేహ, పదేళ్ల కుమారుడితో కలిసి నివసిస్తున్నారు. ఇటీవల మాస్కో పోలీసులు తన భర్తను అదుపులోకి తీసుకున్నారని స్నేహ వెల్లడించారు. అయితే, ఆయనను ఎందుకు అదుపులోకి తీసుకున్నారనే విషయాన్ని అధికారులు స్పష్టంగా వెల్లడించలేదని ఆమె పేర్కొన్నారు.

### సైన్యంలో చేరుస్తారేమోనని ఆందోళన

రష్యా సైన్యంలో సిబ్బంది కొరత నేపథ్యంలో విదేశీయులను సాయుధ దళాల్లో చేర్చుకునేందుకు అక్కడి అధికారులు ప్రయత్నిస్తున్నారని స్నేహ గతంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తన భర్తను అదుపులోకి తీసుకున్నారేమోనని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. తాజాగా చందన్ గుప్తా విడుదలై సురక్షితంగా ఇంటికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు.



# మట్టి గణపతుల పంపిణీకి శ్రీకారం

**తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో చేపట్టిన మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమాన్ని పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసిన ఆమె.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించడం ద్వారా ప్రకృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కార్యక్రమ నిర్వాహకులు సూచించారు. వినాయక చవితి సందర్భంగా ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచే ఉద్దేశంతో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.**

– ప్రజానావ, హైదరాబాద్

## అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

### మహిళ భద్రతపై షీ టీమ్ అవగాహన

**ప్రజానావ, గంభీరావుపేట:** సోషల్ మీడియాలోని అపరిచితుల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని షీ టీం ఏఎస్ఐ ప్రమీల, రవి లు పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గంభీరావుపేట మండలం గజసింగవరం, గోరంటాల గ్రామంలోని జిల్లా పరిషత్ , మండల పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వేధింపులకు గురైతే నిర్భయంగా షీ టీమ్ నెంబర్ 87126 56425 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అపరిచిత వ్యక్తులకు స్పందించి మోస పోవద్దని వివరించారు. కార్యక్రమంలో షీ టీం సిబ్బంది ప్రియాంక, శ్రీలత, శ్రీనివాస్‌తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న భవారియా గ్యాంగ్ సభ్యుడి అరెస్ట్



**ప్రజానావ, పెద్దపల్లి :** వరుస చైన్ స్నాచింగ్‌లు, ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన భవారియా గ్యాంగ్ సభ్యుడిని పెద్దపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన కలిరామ్ (38)గా గుర్తించారు. మరో నిందితుడు కపిల్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులు రైళ్లలో పెద్దపల్లికి చేరుకుని ముందుగా బైక్‌లను దొంగిలించి, వాటిపై తిరుగుతూ రోడ్డుపై ఒంటరిగా వెళ్లే మహిళలను లక్ష్యంగా చేసుకుని బంగారు చైన్లు, పుస్తెల తాళ్లను లాక్కెళ్లినట్లు పోలీసులు వెల్లడించారు. 2026 మార్చి 30న పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో దిగిన నిందితులు ఓ ఇంటి ముందు పార్క్ చేసిన పల్సర్ 220 బైక్ దొంగిలించి, బంధంపల్లి వద్ద మహిళ మెడలోని బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లారు. అదే రోజు రామగుండం ఓల్డ్ బజార్‌లో మరో మహిళ మెడలోని సుమారు 45 గ్రాముల బంగారు పుస్తెల తాడును అపహరించారు. అదేవిధంగా మే 29న పెద్దపల్లి బస్‌స్టాండ్ వద్ద మరో బైక్‌ను దొంగిలించేందుకు ప్రయత్నించగా, ఆ బైక్‌ను బెల్లంపల్లి వద్ద వదిలి ఉత్తరప్రదేశ్‌కు వెళ్లిపోయారు. ఆగస్టు 17న తిరిగి పెద్దపల్లికి వచ్చిన నిందితులు కాలేజీ మైదానం సమీపంలో బైక్‌ను దొంగిలించి, లక్ష్మీ నగర్‌లో మహిళ మెడలోని సుమారు 30 గ్రాముల బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లారు. వరుస ఘటనలపై రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాలతో, పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, ఏసీపీ కృష్ణ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నిందిత డు కలిరామ్‌ను బుధవారం ఉదయం పెద్దపల్లి రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు కపిల్ కోసం గాలింపు కొనసాగుతోంది.

## కాళోజీ స్ఫూర్తితో తెలంగాణ రక్షణ సేన అడుగులు

- తెలంగాణ హక్కుల పరిరక్షణే లక్ష్యం
- సబ్బండ వర్గాల సాధికారత కోసం పోరాటం




**ప్రజానావ, హైదరాబాద్ :** ప్రజాకవి కాళోజీ నారాయణరావు స్ఫూర్తితో తెలంగాణ రక్షణ సేన ముందుకు సాగుతుందని పార్టీ సీనియర్ నాయకులు ఎల్. రూప్ సింగ్, నవీన్ ఆచారి, సయ్యద్ ఇస్మాయిల్ అన్నారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ సమాజంలో హక్కుల కోసం ప్రశ్నించే చైతన్యాన్ని కాళోజీ తన రచనలు, ఉద్యమాల ద్వారా రగిలించారని పేర్కొన్నారు. తమ ప్రాంతంపై దోపిడీకి దిగే శక్తులను ఎంతటి వారైనా ఎదురించాలనే స్ఫూర్తిని కాళోజీ ప్రజల్లో నింపారని అన్నారు. కాళోజీ ఆలోచనా విధానానికి అనుగుణంగానే కవిత టీఆర్ఎస్‌ను స్థాపించి తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తున్నారని నాయకులు తెలిపారు. ప్రాంతేత రులు దోపిడీకి పాల్పడితే పొలిమేర వరకు తరిమికొట్టాలని, ప్రాంతానికి చెందినవారే దోపిడీకి పాల్పడితే వారిని ప్రాంతంలోనే అడ్డుకోవాలన్న కాళోజీ పిలుపు తమకు ఆదర్శమని పేర్కొన్నారు. గతంలో తెలంగాణను దోపిడీ చేసిన ఆంధ్రా పాలకుల నుంచి విముక్తి సాధించామని, అయితే ప్రస్తుతం తెలంగాణకు చెందిన కొందరే ఈ ప్రాంత వనరులు, ప్రయోజనాలను దోపిడీ చేస్తున్నారని నాయకులు ఆరోపించారు. అలాంటి దోపిడీని అడ్డుకుని సబ్బండ వర్గాలు, సకల జనుల అభివృద్ధి, సాధికారత కోసం తెలంగాణ రక్షణ సేన నిరంతరం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎత్తరి మారన్న, ముస్తఫా, ఆనందం తదితరులు పాల్గొన్నారు.



## రైతు సమస్యలు పరిష్కరించాలని రోడ్డుపై బైఠాయించిన రైతన్నలు

**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలోని రహదారిపై గ్రామ సర్పంచ్ మిర్యాల్కర్ బాలాజీ, ఆధ్వర్యంలో రైతులు రైతు సమస్యలపై రాస్తారో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాలుగు గంటల కరెంటు ఇవ్వాలని కాళేశ్వరం నైన్ ప్యాకేజ్ కింద ఉన్నటువంటి భూములకు పెండింగ్ లో ఉన్నటువంటి కాలువలను పూర్తి చేసి వెంటనే నిరందించాలని రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. ఇట్టి సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు తీర్చాలని లేనియెడల ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని అన్నారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు వచ్చి హామీ ఇవ్వడంతో విరమించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ గంగుల ప్రశాంత్,, మాజీ ఉప సర్పంచ్ పొన్నం పరుశరాములు, రమేష్, అభిషేక్, గోపి, తిరుపతి,బక్కయ్య, రాకేష్, ఎల్లయ్య, రాజకుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక, చారిత్రక ప్రాంతాలపై ఉత్తమ రీల్స్ పోటీలు

- ఉత్తమ రీల్స్, వ్యూస్ ఉన్న వారికి నగదు బహుమతులు
- ఈ నెల 20వ తేదీ వరకు పంపాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజానావ, సిరిసిల్ల :** ఈ నెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పర్యాటక, చారిత్రక ప్రాంతాలపై ఉత్తమ రీల్స్, వ్యూస్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్ వద్ద ఉన్న ఫారెస్ట్ అర్బన్ పార్క్, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో ఉన్న వీటీఏడీఏ పార్క్, నాంపల్లి గుట్ట కు సంబంధించిన ఉత్తమ రీల్స్, ఎక్కువ వ్యూస్ వచ్చే వారు ఈ నెల 20 వ తేదీ వరకు పంపించాలని సూచించారు. అర్బన్ ఫారెస్ట్ పార్క్, గుడి చెరువు బండ్ పార్క్, నాంపల్లి గుట్టలో పచ్చదనం, సందర్శకుల సౌకర్యార్థం కల్పించిన మౌలిక సదుపాయాలు, అటవీ సంపదపై విస్తృత ప్రచారం కల్పించి, సందర్శకులు వచ్చేలా సామాజిక మాధ్యమాల వేదికగా రీల్స్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయా అంశాలపై విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అందరినీ ఆకర్షించేలా రీల్స్ పోటీలను నిర్వహించాలని, ఆయా ప్రాంతాల విశేషాలు అందరికీ తెలిసేలా సృజనాత్మకం గా రీల్స్ రూపొందించి, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడం ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందుతుందన్నారు. ఈ పోటీలలో అత్యుత్తమంగా రీల్స్ రూపొందించిన వారిలో మొదటి బహుమతి రూ.15 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ.5 వేల చొప్పున ప్రోత్సహకాలను అందజేస్తామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఉత్తమ రీల్స్ రూపొందించి.. ఎక్కువ వ్యూస్ వచ్చిన రీల్స్ లింక్ ఈ కింది ఫోన్ నెంబర్ 9440239783కు వాట్స్ ఆప్ చేయాలని పేర్కొన్నారు.

## ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొచ్చిన కాళోజీ కృషి

### జిల్లా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

**ప్రజానావ, పెద్దపల్లి :** ప్రజల్లో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని తీసుకొచ్చిన కాళోజీ కృషి మరువలేనిదని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారికంగా నిర్వహించిన కాళోజీ నారాయణరావు జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ సామాజిక సమస్యలపై నిర్మోహమాటంగా, నిక్కచ్చిగా స్పందించే వ్యక్తిత్వం కాళోజీది అన్నారు. సత్యాగ్రహ మహోద్యమంలో పాల్గొని పిన్న వయసులోనే జైలు జీవితం గడిపారని తెలిపారు. విద్యార్థి దశ నుండే నిజాం ప్రభుత్వం నిషేధాజ్ఞలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప నాయకులు కాళోజీ అని కొనియాడారు. తెలంగాణ సాధన ఉద్యమంలో కాళోజీ సాహిత్య స్ఫూర్తి, ఆయన రచనలు ప్రజల్లో గొప్ప చైతన్యాన్ని నింపాయని, ప్రజాకవి కాళోజీ రచనలు, సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని, ముఖ్యంగా యువత కాళోజీ ఆలోచనా విధానాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్ ,సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేయాలి

### సిరిసిల్ల కలెక్టరేట్‌లో సర్పంచుల వినతి

**ప్రజానావ, కోనరావుపే:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రామపంచాయతీల ఆర్థిక, పరిపాలనా వ్యవహారాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పంచాయతీ నిధుల విత్‌డ్రాయల్ విషయంలో ఉప సర్పంచ్‌లకు ఉన్న సంయుక్త చెక్ పవర్ అధికారాన్ని తక్షణమే రద్దు చేయాలనే డిమాండ్‌తో వివిధ గ్రామాల సర్పంచులు బుధవారం జిల్లా కలెక్టరేట్ వేదికగా పెద్దఎత్తున నిరసన స్వరం వినిపించారు. ఈ మేరకు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్‌కు స్వయంగా కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక సమగ్ర అభివృద్ధి, పారిశుధ్యం, నిత్య పరిపాలన బాధ్యతలన్నీ సర్పంచులపైనే ఆధారపడి ఉంటాయన్నారు. స్థానిక ప్రజలకు నేరుగా జవాబుదారీగా ఉండే సర్పంచులకు తమ బాధ్యతలకు అనుగుణంగా స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే పరిపూర్ణ అధికారాలు కల్పించాలని కోరారు. అయితే ప్రస్తుతం అమల్లో ఉన్న ఉప సర్పంచుల చెక్ పవర్ నిబంధన వల్ల గ్రామాల్లో రాజకీయ విభేదాలు, ఆధిపత్య పోరు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెక్కులు, డిజిటల్ సంతకాలపై ఉప సర్పంచులు సంతకాలు చేయకుండా ఆలస్యం చేయడం వల్ల పారిశుధ్య కార్మికుల వేతనాలు, వీధిదీపాలు, తాగునీటి నిర్వహణ వంటి అత్యవసర సేవలతో పాటు గ్రామీణ అభివృద్ధి పనుల బిల్లులు నిలిచిపోతున్నాయని తెలిపారు. గ్రామపంచాయతీలలో అవాంతరాలు లేని పరిపాలన సాగాలంటే ఉప సర్పంచుల చెక్ పవర్ విధానాన్ని రద్దు చేసి, సర్పంచులకు పూర్తిస్థాయి బాధ్యతలు, అధికారాలు అప్పగించాలని స్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని సర్పంచుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు గ్రామాల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బస్సులోకి దూసుకొచ్చిన ఇనుప కడ్డీలు..

- డ్రైవర్ దుర్మరణం
- ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన కేఎస్ఆర్టీసీ బస్సు
- 10 మందికిపైగా తీవ్ర గాయాలు, 8 మంది పరిస్థితి విషమం



**మాండ్య :** కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ట్రాక్టర్‌ను కేఎస్ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టడంతో ట్రాలీలో ఉన్న ఇనుప కడ్డీలు బస్సు ముందు అద్దాన్ని ఛేదించుకుని లోపలికి దూసుకెళ్లాయి. ఈ కడ్డీలు బస్సు డ్రైవర్ పొట్టతోపాటు శరీరంలోకి దిగడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మాం డ్య జిల్లాలోని వరాహసంద్ర గేట్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ ట్రాలీలో ఇనుప కడ్డీలను తరలిస్తుండగా వెనుక నుంచి వచ్చిన కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (కేఎస్ఆర్టీసీ) బస్సు దానిని ఢీకొట్టింది. ప్రమాద ధాటికి ట్రాలీలోని ఇనుప కడ్డీలు బస్సు ముందు భాగాన్ని ఛేదించుకుని డ్రైవర్ వద్దకు దూసుకెళ్లాయి. దీంతో డ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని హాసన్‌కు చెందిన శేఖర్‌గా గుర్తించారు. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న పది మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహా యక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను బెల్లూరులోని ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఎనిమిది మంది పరిస్థితి విష మంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, బస్సు ముందు అద్దాన్ని ఛేదించుకుని లోపలికి దూసుకొచ్చిన ఇనుప కడ్డీలు, బోల్తాపడిన ట్రాక్టర్ దృశ్యాలు, ప్రమాదానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



## కుదిరిన కాటన్ కార్మికుల, ఆసాముల కూలీ ఒప్పందం

- సమ్మెకు వెళ్లకముందే కూలీ పెంచిన యజమానులకు ధన్యవాదాలు
- పెరిగిన కూలి సెప్టెంబర్ 15 నుండి అమలు

**ప్రజానావ, సిరిసిల్ల :** కొద్దిరోజులుగా జరుగుతున్న కార్మికుల ఆందోళన నేపథ్యంలో చర్చలు ఫలించు కూలి ఒప్పందం కుదిరింది. కాటన్ వస్త్రానికి సంబంధించి పవర్లూమ్ కార్మికుల, ఆసాముల కూలి ఒప్పందం గడువు ముగిసినందున వెంటనే చర్చలు జరిపి కూలి పెంచాలని సిఐటియు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కాటన్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘానికి, చేనేత వస్త్ర వ్యాపార సంఘ ప్రతినిధులకు డిమాండ్ నోటీసు ఇచ్చిన దానిపై చేనేత వస్త్ర వ్యాపార సంఘ భవనంలో కాటన్ వస్త్ర ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షులు కట్టెకోల లక్ష్మీ నారాయణ, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు తాటిపాముల దామోదర్‌ల ఆధ్వర్యంలో సిఐటియు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులతో కూలీ చర్చలు జరిగాయి. ఈ కూలి చర్చలలో కాటన్ వస్త్రానికి సంబంధించి పవర్లూమ్ కార్మికులకు 20 కౌంటు ప్యాక కు సంబంధించి గతంలో 10 పిక్కులకు 0 – 44 పైసలు ఉన్న కూలీని 0 – 6 పైసలు పెంచుతూ ప్రస్తుతం 10 పిక్కులకు 0 – 50 పైసలకు కూలి ఒప్పందం జరిగింది. అలాగే పాప్లిన్ వస్త్రానికి సంబంధించి 10 పిక్కులకు 0 – 44 పైసలకు పెంచుతూ అదేవిధంగా ఆసాములకు సంబంధించి డబల్ కూలి చెల్లించే విధంగా ఇరు సంఘాల అంగీకారంతో చర్చలలో కూలి ఒప్పందం జరిగింది పెరిగిన కూలీ సెప్టెంబర్ 15 వ తేదీ నుండి అమలు అవుతుందని బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా సిఐటియు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూషం రమేష్ , జిల్లా అధ్యక్షులు కోడం రమణ లు మాట్లాడుతూ కార్మికులు, ఆసాములు సమ్మెకు వెళ్లకముందే కూలి పెంచిన యజమానులకు ధన్యవాదాలు తెలిపారు. సెప్టెంబర్ 15 నుండి పెరిగిన కూలి ప్రకారం కార్మికులు, ఆసాములు కూలి తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటన్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు, చేనేత వస్త్ర వ్యాపార సంఘం ప్రతినిధులు అలాగే సిఐటియు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఒడిశా అడవుల్లో ఐదు ఒరాంగ్‌టన్ పిల్లలు

- భారత్‌లో సహజంగా కనిపించని జాతి
- స్మగ్లింగ్ చేసి వదిలేశారా? అధికారుల దర్యాప్తు

**బాలాసోర్ :** భారత్‌లో సహజంగా కనిపించని ఒరాంగ్‌టన్ జాతికి చెందిన ఐదు పిల్లలు ఒడిశాలో ప్రత్యక్షమవడం కలకలం రేపుతోంది. బాలాసోర్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఐదు బేబీ ఒరాంగ్‌టన్‌లను అటవీ శాఖ అధికారులు గుర్తించారు. అనంతరం వాటిని బుధవారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని నందన్‌కనాన్ జువాలాజికల్ పార్క్‌కు తరలించారు. ఇవి దేశానికి చెందిన జీవులు కాకపోవడం తోపాటు చిన్న పిల్లలు కావడంతో ప్రత్యేక సంరక్షణ అవసరమని భావించిన అధికారులు జూపార్క్‌లోని 'సెంటర్ ఫర్ రేరింగ్ యానిమల్ బేబీస్'కు తరలించి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అయితే ఈ ఒరాంగ్‌టన్‌లు భారత్‌కు ఎలా చేరుకున్నాయన్నది ఇప్పుడు మిస్టరీగా మారింది. ఎవరైనా వీటిని అక్రమంగా స్మగ్లింగ్ చేస్తూ తీసుకొచ్చి, పరిస్థితులు అనుకూలించకపోవడంతో అటవీ ప్రాంతంలో వదిలేసి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. దీనిపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. సాధారణంగా ఒరాంగ్‌టన్‌లు మలేషియా, ఇండోనేసియా, బోర్నియో, సుమత్రా దీవుల్లో మాత్రమే కనిపిస్తాయి. భారత్‌లో సహజ ఆవాసం లేని ఈ జాతికి చెందిన ఐదు పిల్లలు ఒకేసారి ఒడిశాలో కనిపించడంతో అవి ఎక్కడి నుంచి వచ్చాయనే అంశంపై అధికారులు ఆరా తీస్తున్నారు.



## సర్ నోటీస్‌కు సరైన ధ్రువపత్రాలు అందించాలి

ప్రజానావ, గంభీరావుపేట: సర్ నోటీస్ కు సరైన ధ్రువపత్రాలు అందించి ఓటర్ నమోదు చేసుకోవాలని తహసిల్దార్ మారుతి రెడ్డి కోరారు. బుధవారము గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామంలోని పోలింగ్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా నోటీసులు అందిన ఓటర్ల ధ్రువీకరణ ప్రక్రియ లో పాల్గొన్నారు. ఎన్నికల సంఘం సూచించిన అవసరమైన పత్రాలను సమర్పించి తమ ఓటును నిర్ధారణ చేసుకోవాలన్నారు. సర్ నోటీస్ అందుకున్న ప్రతి ఒక్క ఓటరు ఎన్నికల సంఘం సూచించిన 12 గుర్తింపు పత్రాలలో ఏదైనా గుర్తింపు పత్రం సర్ నోటీస్ కు జత చేసి సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో సమర్పించాలని పేర్కొన్నారు.



# యుద్ధ విరమణ దిశగా సాగని చర్చలు

**తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరియు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గంట పాటు ఫోన్ ద్వారా సంభాషించారు. ఈ సంభాషణలో శాంతి చర్చకర్తలైన స్టీవ్ విట్కాఫ్ మరియు జారెడ్ కుష్నర్ రష్యా మరియు ఉక్రెయిన్‌లో చేసిన సందర్శన ఫలితాలను చర్చించారు. ట్రంప్ పుతిన్‌కు ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధానికి త్వరగా ముగింపు కావాలని కోరారు, ఇది అమెరికా–రష్యా సంబంధాలను పూర్తిగా పునరుద్ధరించడానికి సహాయపడుతుందని క్రెమ్లి న్ తెలిపింది.**

రష్యా– ఉక్రెయిన్ మధ్య చాలా కాలంగా యుద్ధం కొనసాగుతూనే ఉంది. యుద్ధ విరమణకు అనేక దఫాలుగా చర్చలు జరిగిన ఎ ఒక్కటీ కొలిక్కిరాలేదు. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరియు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గంట పాటు ఫోన్ ద్వారా సంభాషించారు. ఈ సంభాషణలో శాంతి చర్చకర్తలైన స్టీవ్ విట్కాఫ్ మరియు జారెడ్ కుష్నర్ రష్యా మరియు ఉక్రెయిన్‌లో చేసిన సందర్శన ఫలితాలను చర్చించారు. ట్రంప్ పుతిన్‌కు ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధానికి త్వరగా ముగింపు కావాలని కోరారు, ఇది అమెరికా–రష్యా సంబంధాలను పూర్తిగా పునరుద్ధరించడానికి సహాయపడుతుందని క్రెమ్లి న్ తెలిపింది. ఈ సందర్భంగా, పుతిన్ రోప్ పట్ల రష్యాకు దురాశలు లేవని ట్రంప్‌కు హామీ ఇచ్చారు. పుతిన్ విదేశీ వ్యవహారాల సలహాదారు రీ ఉషాకోవ్, పుతిన్ మరియు ట్రంప్ మధ్య జరిగిన ఈ గంటల సంభాషణ 'సంఘటితమైన మరియు చాలా స్పష్టమైనది' అని పేర్కొన్నారు. విట్కాఫ్ మరియు కుష్నర్ చేసిన సందర్శన ఫలితాలను మాస్కో సానులంగా చూస్తుందని ఆయన చెప్పారు. 'డొనాల్డ్ ట్రంప్ యుద్ధాన్ని త్వరగా ముగించాలనే తలంపును స్పష్టంగా వ్యక్తం చేశాడు, ఇది అమెరికా మరియు రష్యా మధ్య సంబంధాలను పునరుద్ధరించడానికి అద్భుత మైన అవకాశాలను తెరవగలదు' అని ఉషాకోవ్ చెప్పారు. 'ఈ దష్టిలో, ఇది వాణిజ్య ఆర్థిక సంబంధాలపై ప్రత్యేక ప్రభా వం చూపుతుంది, రెండు దేశాలకు భారీ లాభాలను అందించగలదు. ట్రంప్ తన అధ్యక్షతలో ఒక ప్రగతి సాధించాలని ఆసక్తిగా ఉన్నాడు. ఈ దష్టిని పుతిన్ మద్దతు ఇచ్చారు'. ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధం ముగించేందుకు ట్రంప్, పుతిన్ మధ్య జరిగిన ఈ సంభాషణలో రోపియన్ దేశాల పట్ల రష్యా యొక్క దురాశల గురించి చర్చ జరిగింది. 'రోప్ పట్ల మాకు ఏ దురాశలు లేవు' అని ఉషాకోవ్ చెప్పారు. ఈ కాల్‌పై వైట్ హౌస్ లేదా అమెరికా అధ్యక్షుడి నుండి వెంటనే స్పందన లేదు. అమెరికా శాంతి చర్చకర్తలు జారెడ్ కుష్నర్ మరియు స్టీవ్ విట్కాఫ్ మాస్కో మరియు కీవ్‌లో పుతిన్ మరియు ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలొదిమిర్ జెలెన్స్కీతో వేర్వేరు చర్చలకు వెళ్లారు. ఈ సమావేశాలు యుద్ధాన్ని ముగించేందుకు ప్రధానమైన ప్రగతి సాధించలేకపోయాయి, మరియు రెండు దేశాలు శుక్రవారం జరిగిన శాంతి విరమణ తర్వాత తమ వాయు యుద్ధాన్ని కొనసాగించాయి. మంగళవారం స్థానిక అధికారులు తెలిపిన ప్రకారం, రష్యా కీవ్ నగరాన్ని డ్రోన్లు, మిస్సైల్‌లతో బాంబు విసిరినప్పుడు రెండు వ్యక్తులు మరణించారు. మరోవైపు, ఉక్రెయిన్ దాడిలో క్రిమియాలో రెండు వ్యక్తులు మరణించారు. ఇటీవల నెలలుగా, రష్యా మరియు ఉక్రెయిన్ ఒకదానికొకటి నష్టపరిహారం చెల్లించేందుకు తమ వాయు యుద్ధాన్ని పెంచాయి. ఈ రోజు ముందుగా, రష్యా అధ్యక్షుడి ప్రాతినిధి దిమిత్రి పెస్కోవ్, 'రష్యాకు విజయానికి దగ్గరగా ఉన్నామని' చెప్పారు, 'విజయం చాలా దగ్గరగా ఉంది' అని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు అంతర్జాతీయ రాజకీయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ , దౌత్య సంబంధాల నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య శుక్రవారం కీలక ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్య బంధం, అంతర్జాతీయ రవాణా ప్రాజెక్టులతో పాటు ముఖ్యంగా సుదీర్ఘంగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి శాంతియుత ముగింపు పలకడమే లక్ష్యంగా ఈ భేటీ సాగనుందని రష్యా అధికారిక కార్యాలయం 'క్రెమ్లిన్' ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పష్టం చేశారు. 11న ఢిల్లీ వేదికగా భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఆ సమావేశానికి ముందే మోదీ – పుతిన్ ఒకరిని ఒకరు కలవబోతున్నారు. అనంతరం ఇరు దేశాల ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. యుద్ధ పరిష్కారం కోసం భారత్ చూపిస్తున్న నిబద్ధతను, చొరవను రష్యా మనస్ఫూర్తిగా స్వాగతిస్తోందని ఆయన వెల్లడించారు. అసలు తాము ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకోలేదని, గతంలో మొదలైన ఈ వివాదానికి శాంతియుతంగా చుక్కాని పెట్టడాని రష్యా ప్రయత్నిస్తోందని చెప్పారు. రష్యా, ఉక్రెయిన్ , అమెరికా మధ్య మళ్లీ శాంతి చర్చలు ప్రారంభమవుతాయని తాము ఆశిస్తున్నామని, శాంతి పునరుద్ధరణ కోసం భారత్‌తో పాటు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు డా ఆహ్వానించదగినవేనని కొనియాడారు. శాంతి ప్రక్రియ ముందుకు సాగాలంటే వలం తమ వైపు నుంచే కాకుండా ఉక్రెయిన్ నుంచి కూడా అంతే సుముఖత ఉండాలని రష్యా స్పష్టం చేసింది. కొన్ని ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌ను నిరంతరం రెచ్చగొడుతూ శాంతి చర్చలను పక్కదారి పట్టించేందుకు కుట్ర పన్నుతున్నాయని పెస్కోవ్ సంచలన ఆరోపణలు చేశారు. అయితే ఆ విదేశీ కుట్రలు ఫలించకుండా తాము అడ్డుకుంటామని, శాంతి మార్గంలోనే పరిష్కారాన్ని అన్వేషి స్తామని పునరుద్ఘాటించారు. ఈ ఇరువురి భేటీలో నైనా రష్యా యుద్ధం ముగింపునకు స్వస్తి పలకాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయప డుతున్నారు.

**శాంతి ప్రక్రియ ముందుకు సాగాలంటే వలం తమ వైపు నుంచే కాకుండా ఉక్రెయిన్ నుంచి కూడా అంతే సుముఖత ఉండాలని రష్యా స్పష్టం చేసింది. కొన్ని ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌ను నిరంతరం రెచ్చగొడుతూ శాంతి చర్చలను పక్కదారి పట్టించేందుకు కుట్ర పన్నుతున్నాయని పెస్కోవ్ సంచలన ఆరోపణలు చేశారు. అయితే ఆ విదేశీ కుట్రలు ఫలించకుండా తాము అడ్డుకుంటామని, శాంతి మార్గంలోనే పరిష్కారాన్ని అన్వేషి స్తామని పునరుద్ఘాటించారు. ఈ ఇరువురి భేటీలో నైనా రష్యా యుద్ధం ముగింపునకు స్వస్తి పలకాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయప డుతున్నారు.**

## ఫీజు రియంబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలి

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ నాయకులు బింగి రాము యాదవ్, వీరపాగ శివ మహారాజ్ డిమాండ్



ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 14 వేల కోట్ల రూపాయల విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ–జేఏసీ రాష్ట్ర నాయకుడు బింగి రాము యాదవ్, ధర్మ సమాజ పార్టీ నాయకుడు వీరపాగ శివ మహారాజ్ డిమాండ్ చేశారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలో వివిధ కళాశాలల విద్యార్థులతో కలిసి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణం వద్ద దీక్షా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బింగి రాము యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించలేక చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయని, కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. వీరపాగ శివ మహారాజ్ మాట్లాడుతూ.. ఈ సమస్య ప్రభావం దాదాపు కోటి కుటుంబాలపై పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మ స్టూడెంట్ యూనియన్ నాయకులు శివ, సుబ్బయ్య యాదవ్, మధు, సంధ్యారాణి, మన్యం, ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, కావలి కురుమన్న, అశోక్, ఆంజనేయులు, రవి, రమేష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



## కేసీఆర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు

### రేవల్లిలో షాద్‌నగర్ ఎమ్మెల్యేపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజానావ ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో : బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మరణాన్ని కోరుతూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కె. శంకరయ్యపై చర్యలు తీసుకోవాలని రేవల్లి పోలీసులకు ఫిర్యాదు అందింది. బీఆర్ఎస్ మండల మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు శివరాం రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఎస్ఐ రజితకు ఈ ఫిర్యాదు సమర్పించారు. ఈ నెల 8న ఒక టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో ఎమ్మెల్యే శంకరయ్య మాట్లాడుతూ.. కేసీఆర్ చనిపోవాలని, అందుకే వెయ్యి డప్పులతో ర్యాలీ నిర్వహిస్తున్నామని బహిరంగంగా అనడం కలకలం రేపింది. ఈ వ్యాఖ్యలు కేసీఆర్ ప్రాణ భద్రతకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని, సీఎం రేవంత్ రెడ్డి సహా ఇతర కాంగ్రెస్ నేతల ప్రేరణతోనే ఎమ్మెల్యే ఇలా మాట్లాడారని నాయకులు ఆరోపించారు. ఎమ్మెల్యే శంకరయ్యపై భారతీయ నవన్యాయ సంహిత సెక్షన్లు 196, 351(3), 352, 353, 61 కింద కేసు నమోదు చేయాలని, అలాగే కేసీఆర్ నివాసానికి తగిన పోలీస్ భద్రత పెంచాలని పోలీసులను కోరారు.



## సర్ పై ఓటర్లకు అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ హరిసింగ్

ప్రజానావ, తుంగతుర్తి : ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ హరిసింగ్ సూచించారు. తుంగతుర్తి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియ గడువును మరోసారి పొడిగించిన నేపథ్యంలో, ఈ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందిన ఓటర్లకు అవసరమైన సమాచారం అందించి అవగాహన కల్పించాలని సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్ల నుంచి సంబంధిత ధ్రువపత్రాలను సేకరించి, వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ దయానందం, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## పదవులు రాకపోయినా ప్రతి కార్యకర్తను గుర్తిస్తా

- త్వరలో మండలాల వారీగా సమావేశాలు
- ప్రతి కార్యకర్తతో వన్‌టువన్‌గా మాట్లాడతా: జగ్గారెడ్డి




ప్రజానావ, సంగారెడ్డి : పార్టీలో పదవులు దక్కని వారు ఎలాంటి నిరాశకు గురికావద్దని, పదవులు ఉన్నా లేకపోయినా ప్రతి కార్యకర్తను గుర్తించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని క్లాసిక్ గార్డెన్స్‌లో డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కమిటీల నియామక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల కాంగ్రెస్ కమిటీలతో పాటు రెండు మున్సిపాలిటీల కమిటీలను ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళా, ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ కిసాన్ సెల్‌తో పాటు ఇతర ఫ్రంటల్ ఆర్గనైజేషన్ల కమిటీలను సైతం ప్రకటించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ పార్టీలో పదవులు వచ్చిన వారు, రాని వారు అనే తేడా లేకుండా ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు ఉంటుందని తెలిపారు. పార్టీ పదవి దక్కలేదని ఎవరూ నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమని పేర్కొన్నారు. అందరూ సమన్వయంతో, ఐక్యంగా పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై త్వరలో వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించను న్నట్లు వెల్లడించారు. నాలుగు మండలాలకు చెందిన గెలిచిన, ఓడిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకు లతో అధికారుల సమక్షంలో ప్రత్యేక సమీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. రెండు మున్సిపాలిటీల ప్రజాప్రతినిధులు, అధికారులతోనూ ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 30 నుంచి నాలుగు రోజుల పాటు వరుసగా సమావేశాలు నిర్వహించి ప్రతి కార్యకర్తతో వన్‌టువన్‌గా మాట్లాడతానని జగ్గారెడ్డి వెల్లడించారు. ఈ సమావేశాలకు పోలీస్ శాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను ఆహ్వానించి ప్రజా సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై చర్చిస్తామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజలకు మరింత చేరువ కావాలని జగ్గారెడ్డి సూచించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- మెదక్‌లో షీ టీమ్స్ అవగాహన సదస్సు
- గుడ్ టచ్, బ్యాడ్ టచ్, టీ–సేఫ్ యాప్
- బాలల అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన



ప్రమజానావ, మెదక్: విద్యార్థుల భద్రత, సైబర్ నేరాల నివారణ, షీ టీమ్స్ సేవలపై అవగాహన కల్పించేందుకు మెదక్ సబ్ డివిజన్ షీ టీమ్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పలు కీలక అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గుడ్ టచ్–బ్యాడ్ టచ్పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ.. అనుమానాస్పద స్పర్శలను ఎలా గుర్తించాలి, ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయు లకు వెంటనే ఎలా తెలియజేయాలనే విషయాలను వివరిం చారు. అలాగే సోషల్ మీడియా మోసాలు, ఆన్‌లైన్ గేమింగ్ ప్రమాదాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా విద్యార్థులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. మహిళలు, యువతులు అత్యవసర ప్రయాణాల్లో భద్రత పొందేందుకు తెలంగాణ పోలీసులు ప్రవేశపెట్టిన టీ–సేఫ్ యాప్ ప్రత్యేకతలు, దాని వినియోగ విధానాన్ని అధికారులు వివరించారు. బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాల నివారణ, పిల్లలకు ఉన్న చట్టపరమైన రక్షణలు తదితర అంశాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపుల నివారణలో షీ టీమ్స్ అందిస్తున్న సేవలు, ఆపద సమయంలో పోలీసులను ఎలా ఆశ్రయించాలనే విషయాలను వివరించారు. సమస్యలు ఎదురైనప్పుడు విద్యార్థులు భయపడకుండా వెంటనే తల్లిదం డ్రులు, ఉపాధ్యాయులకు సమాచారం అందించాలని, అవసరమైతే డయల్ 112 ద్వారా పోలీసులను సంప్రదించాలని అధికారులు సూచించారు. విద్యార్థుల భద్రతే మా ప్రాధాన్యత" అని మెదక్ జిల్లా పోలీసులు పేర్కొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్ఐ క్రాంతికుమార్

ప్రజానావ, తుంగతుర్తి : ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వాటిపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ క్రాంతికుమార్ సూచించారు. తుంగతుర్తి మండల కేంద్రంలోని శ్రీ విద్యాభారతి పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని, అనుమానాస్పద లింకులు, సందేశాలు, ఫోన్ కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను కలిగి ఉండాలని తెలిపారు. రహదారి భద్రతా నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## కేసీఆర్‌కు ప్రాణహాని కుట్రపై బీఆర్ఎస్ ఫిర్యాదు

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై ఆగ్రహం
- నేరాన్ని ప్రోత్సహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజానావ, బూర్గంపహాడ్ : తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ప్రాణహాని కలిగించే కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత మాట్లాడుతూ కేసీఆర్‌కు భౌతికంగా కీడు జరగాలని కోరుకోవడం నేరపూరిత చర్య అన్నారు. రాజకీయంగా భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ నేరాన్ని ప్రోత్సహించేలా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కేసీఆర్ చావును కోరుతూ వ్యాఖ్యలు చేశారంటూ ఆమె ఆరోపించారు. ఇలాంటి వ్యాఖ్యలు క్షమించరాని నేరమని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా నేరాన్ని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, సారపాక పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీను, మండల నాయకులు మేడం లక్ష్మి నారాయణరెడ్డి, దారం కృష్ణారెడ్డి, మేడగం శ్రీనివాసరెడ్డి, కురుకుంట్ల చిన్నపరెడ్డి, చేతుల పెద్దవీర్రాజు, బానోతు శ్రీను, వార్డు సభ్యులు నాగేశ్వరరావు, కోటయ్య, తుంగ నాగయ్య, మాజీ గ్రామ కమిటీ సభ్యులు కాసిమళ్ల సురేష్, బోరెం శ్రీను, గుల్మహ్మద్, కామిరెడ్డి పద్మ, మాజీ ఎంపీటీసీ దాసరి వెంకట రమణ, బండారి లక్ష్మి నారాయణ, మదమంచి రాజేశ్వరరావు, సాదిక్‌పాషా, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, కేవీ రమణ, యారం

## స్వేచ్ఛగా బతకాలని చాటిన ప్రజాకవి కాళోజీ

- నవ సమాజ నిర్మాణానికి కాళోజీ స్ఫూర్తి
- ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- ఎంపీడీవో జమలారెడ్డి

ప్రజానావ, బూర్గంపహాడ్ : ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా బతకాలని చాటిన మానవతావాది, ప్రజా కవి, ఉద్యమ కెరటం కాళోజీ నారాయణరావు అని బూర్గంపహాడ్ ఎంపీడీవో కుడుముల జమలారెడ్డి అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతి సంద ర్భంగా బూర్గంపహాడ్ మండల పరిషత్ కార్యాల యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణానికి కవిగా తెలంగాణ ప్రజలకు భాష, యాసను పరిచయం చేసిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు. ప్రజల హక్కులు, స్వేచ్ఛ కోసం తన రచనలు, ఉద్యమాల ద్వారా నిరంతరం గొంతుకగా నిలిచిన కాళోజీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమా జ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయా లని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఆయన సేవలను,

ఆశయాలను గుర్తిస్తూ హనుమకొండ జిల్లాలో కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయా న్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. కాళోజీ చూపిన బాటలో సమాజంలో సమానత్వం, స్వేచ్ఛ, మానవతా విలువలను పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో యూడీసీ పద్మా వతి, మండల పరిషత్, ఉపాధి హామీ, ఎంఈవో కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సేవల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

- జూలూరుపాడు పీహెచ్‌సీలో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ
- అత్యవసర మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశం

ప్రజానావ, జూలూరుపాడు : జూలూరుపాడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని, వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆస్పత్రికి వచ్చే రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అత్యవసర మందుల కొరత ఏర్పడకుండా ఎప్పటికప్పుడు నిల్వలను తనిఖీ చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పాముకాటు, కుక్కకాటుకు వినియోగించే ఏఎస్‌వీ, ఏఆర్‌వీ ఇంజెక్షన్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా జ్వరపీడితుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ సూచించారు. ఆశా కార్యకర్త లు, గ్రామపంచాయతీ సిబ్బందితో సమన్వయం చేసుకుని ప్రతి శుక్రవారం డ్రై డే–ఫ్రై డే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు స్థానిక పాఠశాలలు, వసతి గృహాలను క్రమం తప్పకుండా సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుని గ్రామాల్లో పారిశుధ్యం, పచ్చదనం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా మురికివాడల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, హెడ్ నర్స్ ఇందిర, నర్సింగ్ ఆఫీసర్ జాన్‌బీ, ఫార్మసీ ఆఫీసర్ శశికళ, హెల్త్ విజిటర్లు రాధిక, ప్రియదర్శిని తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





## కాళోజి కలం.. ప్రజల గొంతుక

**నివాళులర్పించిన ఎస్పీ అఖిల్ మహాజన్**

**ప్రజానావ, అదిలాబాద్:** తెలంగాణ భాష, సంస్కృతి, ప్రజా చైతన్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన పద్మ విభూషణ్ ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను అదిలాబాద్ జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందికి తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ మట్టి గొప్పతనాన్ని, ప్రజల ఆకాంక్షలను తన రచనల ద్వారా ప్రపంచానికి చాటిన కాళోజి.. ప్రజల సమస్యలను తన కలంతో ప్రశ్నించిన చైతన్య స్వరం అని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజల హక్కులు, తెలంగాణ భాష, సంస్కృతి, సామాజిక చైతన్యం కోసం కాళోజి చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన రచనలు, ఆశయాలను స్మరించుకుంటూ ప్రజా చైతన్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. "కాళోజి కలం.. ప్రజల గొంతుక"గా నిలిచిందని పేర్కొంటూ, ఆయన ఆశయాలు, స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పోలీసు అధికారులు తెలిపారు.

## కాళోజీ కలం.. సామాజిక చైతన్యానికి ఉద్యమ స్వరం

- **ఘనంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు**
- **చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**ప్రజానావ, సిరిసిల్ల:** ప్రజాకవి, తెలంగాణ భాషా యోధుడు కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను సిరిసిల్ల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ కాళోజీ నారాయణ రావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. కాళోజీ తన రచనలు, కవిత్వం ద్వారా సామాజిక పరిస్థితులను ప్రతిబింబిస్తూ ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చారని కొనియాడారు. సమాజంలోని సమస్యలను తన కలం ద్వారా ఎత్తిచూపి ప్రజలను ఆలోచింపజేసిన మహనీయుడిగా కాళోజీ నిలిచిపోయారని పేర్కొన్నారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతిపై కాళోజీకి ఉన్న అభిమానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ అన్నారు. కాళోజీ ఆశయాలు, ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకొని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఓ శ్రీనివాస చారి, ఏడీ మైన్స్ క్రాంతి కుమార్, డీవైఎస్ఓ రాందాస్, పరిశ్రమల శాఖ జీఎం హన్మంతు, జిల్లా వైద్యాధికారి ఏంజెలా అల్ఫ్రెడ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, కలెక్టరేట్ పర్యవేక్షకులు ఉమారాణి, వైశాలి తదితరులు పాల్గొన్నారు.

## అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తూ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన



**ప్రజానావ, గంభీరావుపేట :** స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలు నిరసిస్తూ మాల మహానాడు నాయకులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. జాతీయ మాలల ఐక్య వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దోసల చంద్రం ఆధ్వర్యంలో గంభీరావుపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి అనంతరం నిరసన కార్యక్రమం నిర్వహించారు. దళిత స్పీకర్ పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ అవమానకరమైన మాటలు రాష్ట్రంలోనే చీకటి రోజుగా అభివర్ణించారు. గౌరవప్రదమైన శాసనసభ స్పీకర్ కే ఇలాంటి పరిస్థితి ఎదురైతే సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తాతా మధు పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కూడేల్లి ప్రవీణ్, మాలల ఐక్యవేదిక జిల్లా కోకన్వీనర్ మల్యాల రాజ్వీర్ లక్కం బాబు, మద్దెల రాజనర్స్, శనిగారపు నరేష్, దోసల రాజు, టేకు మల్ల రాజు, బరిగెల సురేష్, సుందరగిరి బాలరాజు, దోసల రామచంద్రం, మద్దెల శంకర్, దాసరి నారాయణ, బండమీది దేవయ్య, కాదరి సత్యం, అనిల్, అశోక్ లు పాల్గొన్నారు.

## వేములవాడ రాజన్న సన్నిధిలో శ్రావణ మాస శివరాత్రి వేడుకలు

**కన్నులపండువగా ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన**



**ప్రజానావ, వేములవాడ:** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణ మాస శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామున 5:30 గంటల నుంచి స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీ గణపతి స్వామివారికి అధర్వశీర్ష పారాయణంతో మహాభిషేకం, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం 6:05 గంటలకు 11 మంది వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య 365 జ్యోతులు వెలిగించి మహాలింగార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమ వివరాలను ఆలయ పీఆర్వో పెరిక శ్రీనివాస్ మీడియాకు వెల్లడించారు.



## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- **సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బీ. గీతే పిలుపు**
- **చిన్నచిన్న కేసులతో సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని సూచన**

**ప్రజానావ, సిరిసిల్ల:** ఈనెల 12న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే సూచించారు. రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకుని సత్వర న్యాయం పొందాలని ఆయన కోరారు. జాతీయ మెగా లోక్ అదాలత్‌లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన నిర్వాహణ కేసులు, వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, పెట్టీ కేసులు తదితర రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు. 'రాజీ మార్గం రాజమార్గం' అని పేర్కొన్న ఎస్పీ.. చిన్నచిన్న కేసులతో కక్షలు పెంచుకుని విలువైన సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని సూచించారు. న్యాయశాఖ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందాలని కోరారు. రాజీ పడదగిన కేసులను పోలీసు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, ఇతర పోలీసు సిబ్బంది గుర్తించాలని ఎస్పీ సూచించారు. ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి, రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం లభించడంతో పాటు ఇరువర్గాల సమయం, ఖర్చు ఆదా అవుతుందని ఎస్పీ మహేష్ బి. గీతే తెలిపారు.

# బైక్ చోరీ.. అదే బైక్‌పై చైన్ స్నాచింగ్

- **పెద్దపల్లిలో వరుస చోరీలకు చెక్**
- **యూపీకి చెందిన నిందితుడు అరెస్ట్, మరో వ్యక్తి పరారీ**



**ప్రజానావ, పెద్దపల్లి :** పెద్దపల్లి పట్టణంలో వరుసగా జరుగుతున్న ద్విచక్ర వాహనాల చోరీలు, చైన్ స్నాచింగ్ కేసులను పోలీసులు ఛేదించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన భవారియా తెగకు చెందిన కలిరామ్ (38)ను అరెస్ట్ చేయగా, మరో నిందితుడు కపిల్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కలిరామ్ నుంచి చోరీకి గురైన పల్సర్ 220 ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిందితులు ఉత్తరప్రదేశ్ నుంచి రైలులో వివిధ ప్రాంతాలకు చేరుకుని ముందుగా ఇళ్ల ముందు, బహిరంగ ప్రదేశాల్లో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీ చేసేవారు. అనంతరం అదే వాహనాలపై తిరుగుతూ రోడ్లపై ఒంటరిగా కనిపించే మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి మెడలోని బంగారు చైన్లు, పుస్తెలతాళ్లు లాక్కొని పరారయ్యేవారు. దొంగిలించిన ఆభరణాలను విక్రయించి వచ్చిన డబ్బుతో జల్సాలు చేసుకునేవారని పోలీసులు వెల్లడించారు. మార్చి 30న ఉత్తరప్రదేశ్ నుంచి రైలులో పెద్దపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకున్న నిందితులు అదే రోజు రాత్రి సుమారు 7 గంటలకు రైల్వే కాలనీలోని ఓ ఇంటి ముందు పార్క్ చేసిన పల్సర్ బైక్‌ను దొంగిలించారు. అదే బైక్‌పై పెద్దపల్లి మీదుగా రామగుండం వైపు వెళ్తూ రాత్రి 8 గంటల సమయంలో బంధంపల్లిలో ఇంటి ముందు రోడ్డుపై ఒంటరిగా ఉన్న గుండు నర్సమ్మ మెడలోని సుమారు రెండు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పరారయ్యారు. అనంతరం రాత్రి 8.45 గంటలకు రామగుండం ఓల్డ్ బజార్‌లో మరో మహిళతో మాట్లాడుతున్న కోల కుసుమ మెడలోని సుమారు 45 గ్రాముల బంగారు పుస్తెలతాడును తెంపుకుని వెళ్లిపోయారు. ఆ తర్వాత చోరీ చేసిన బైక్‌ను బల్హార్ష వద్ద వదిలి రైలులో ఉత్తరప్రదేశ్‌కు చేరుకున్నారు. మే 29న మరోసారి రైలులో పెద్దపల్లికి వచ్చిన నిందితులు రాత్రి 8 గంటల సమయంలో బస్‌స్టాండ్ ముందు పార్క్ చేసిన పల్సర్ బైక్‌ను చోరీ చేశారు. పెద్దపల్లి, గోదావరిఖని ప్రాంతాల్లో తిరిగినా చైన్ స్నాచింగ్‌కు అవకాశం లభించకపోవడంతో ఆ బైక్‌ను బెల్లంపల్లి వద్ద దాచిపెట్టి తిరిగి రైలులో యూపీకి వెళ్లిపోయారు. ఆగస్టు 17న మళ్లీ పెద్దపల్లికి చేరుకున్న నిందితులు రాత్రి 8.30 గంటలకు కాలేజీ మైదానం సమీపంలో పల్సర్ బైక్‌ను చోరీ చేసి, అదే వాహనంపై పట్టణంలో తిరుగుతూ లక్ష్మీనగర్‌లో రోడ్డుపై ఉన్న నూనె స్వరూప మెడలోని సుమారు 30 గ్రాముల బంగారు పుస్తెలతాడును తెంపుకుని పరారయ్యారు. అనంతరం చోరీ చేసిన బైక్‌ను వాంకిడి–బల్హార్ష మధ్య ప్రాంతంలో వదిలి రైలులో ఉత్తరప్రదేశ్‌కు వెళ్లిపోయారు. వరుస చైన్ స్నాచింగ్‌లు, బైక్ చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, ఐపీఎస్ (డీఐజీ), పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి, ఏసీపీ జి. కృష్ణ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన పోలీసులు నిందితులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన భవారియా తెగకు చెందిన వారిగా గుర్తించారు. అనంతరం ప్రత్యేక బృందం యూపీకి వెళ్లి వారి కదలికలపై కీలక సమాచారాన్ని సేకరించింది. నిందితులు తిరిగి పెద్దపల్లి వైపు వస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. గతంలో చోరీ చేసి బెల్లంపల్లి వద్ద దాచిన పల్సర్ బైక్‌ను తీసుకుని కలిరామ్ పెద్దపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకుని కపిల్ కోసం వేచి ఉండగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి చోరీకి గురైన పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో చైన్ స్నాచింగ్ కేసులకు సంబంధించిన సొత్తు పరారీలో ఉన్న కపిల్ వద్ద ఉన్నట్లు కలిరామ్ వెల్లడించినట్లు డీసీపీ తెలిపారు. కపిల్‌ను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా పనిచేసిన పెద్దపల్లి సీఐ కె. ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ కె. నరేష్, సీసీఎస్ ఎస్ఐ ఎం.డి. నసీర్, హెచ్‌సీ కె. సుధాకర్, పీసీలు కె. ప్రభాకర్, కె. విజయ్ కుమార్, బి. ప్రేమ్‌సాగర్‌లను డీసీపీ బి. రామ్‌రెడ్డి, ఏసీపీ జి. కృష్ణ అభినందించారు. ద్విచక్ర వాహనాలను భద్రంగా పార్క్ చేసుకోవాలని, మహిళలు ఒంటరిగా ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



## ఘనంగా కాళోజీ జయంతి

- **పూలమాల వేసి నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ప్రజానావ, సిరిసిల్ల :** కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పాల్గొని, కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ కాళోజీ తన రచనలు, కవిత్వం ద్వారా సామాజిక పరిస్థితులను ప్రతిబింబిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారన్నారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి పై కాళోజీకి ఉన్న అభిమానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ శ్రీనివాస చారి, ఏడీ మైన్స్ క్రాంతి కుమార్, డీవైఎస్ఓ రాందాస్, పరిశ్రమల శాఖ జీఎం హన్మంతు, జిల్లా వైద్యాధికారి ఏంజెలా అల్ఫ్రెడ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, కలెక్టరేట్ పర్యవేక్షకులు ఉమారాణి, వైశాలి, తదితరులు పాల్గొన్నారు.




## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- **విద్యార్థులకు షీ టీమ్ అవగాహన**
- **మాదకద్రవ్యాలు, ట్రాఫిక్ నిబంధనలపై సూచనలు**

**ప్రజానావ, మంచిర్యాల :** సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, మహిళలు, బాలికల భద్రత, రహదారి భద్రతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మంచిర్యాల జిల్లా షీ టీమ్ సిబ్బంది సూచించారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మంచిర్యాల షీ టీమ్ ఆధ్వర్యంలో మంచిర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని గర్మిల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికల భద్రత కోసం షీ టీమ్ అందిస్తున్న సేవలు, విధులు, లక్ష్యాలను విద్యార్థులకు వివరించారు. మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులు, ఇబ్బందులు ఎదుర్కొన్నా భయపడకుండా ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింకులు, అనుమానాస్పద మెసేజ్‌లు, ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని తెలిపారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, వాటి వినియోగంతో కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాలను తెలుసుకోవాలని సూచించారు. రహదారులపై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రహదారి భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. విద్యార్థులు, మహిళలు ఎలాంటి ఆపద, వేధింపులు లేదా సమస్యను ఎదుర్కొన్నా వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో రామగుండం షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, మంచిర్యాల షీ టీమ్ వాట్సాప్ నంబర్ 8712659385ను సంప్రదించాలని తెలిపారు. ఈ నంబర్లను విద్యార్థులు తమ ఫోన్లలో సేవ్ చేసుకోవడంతో పాటు అవసరమైన వారికి కూడా తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో షీ టీమ్ కానిస్టేబుళ్లు వనిత, సతీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజ వర్మ, వ్యాయామ ఉపాధ్యాయురాలు వరలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పత్తి చేనులో గంజాయి సాగు.. రైతు అరెస్ట్

**ప్రజానావ, ఆదిలాబాద్:** పత్తి పంట మధ్యలో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని నేరడిగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. బోరిగాం గ్రామానికి చెందిన ఆడే కపిల్ (33) పత్తి పంటలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు దాడి చేసి అతడిని అదుపులోకి తీసుకు న్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. నేరడిగొండ మండలం బోరిగాం గ్రామ శివారులో పత్తి పంట మధ్యలో గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 4 నుంచి 5 అడుగుల ఎత్తు పెరిగిన 125 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.12.50 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయి సాగుకు ఉపయోగించిన స్ప్లెండర్ ప్లస్ ద్విచక్ర వాహనాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితుడు ఆడే కపిల్, తండ్రి లాలు ఆడే, బోరిగాం గ్రామం, నేరడిగొండ మండలానికి చెందిన వ్యక్తిగా పోలీసులు వెల్లడించారు. నిందితుడిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి సాగు, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఇచ్చోడా రూరల్ సీఐ సిహెచ్. రమేష్ హెచ్చరించారు. గంజాయి సాగు చేసే వారికి ప్రభుత్వ పథకాలు అందకుండా సిఫారసు చేస్తామని ఆయన తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో నేత్ర పరీక్షలు

- **సెప్టెంబర్ 15 నుంచి ప్రత్యేక శిబిరాలు**
- **నో స్కూల్ లెఫ్ట్-నో చైల్డ్ లెఫ్ట్' లక్ష్యంతో సమగ్ర కంటి పరీక్షలు**

**ప్రజానావ, సిరిసిల్ల :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సమగ్ర నేత్ర పరీక్షలు నిర్వహించేందుకు సెప్టెంబర్ 15 నుంచి ప్రత్యేక నేత్ర పరీక్షా శిబిరాలు చేపట్టనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ తెలిపారు. ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంపై వైద్యాధికారులు, ఫార్మసిస్టులు, ఏఎన్ఎంలతో డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. 'నో స్కూల్ లెఫ్ట్—నో చైల్డ్ లెఫ్ట్' లక్ష్యంతో జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల్లో దృష్టి లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన వారికి కళ్లద్దాలు అందించడంతో పాటు తదుపరి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నేత్ర పరీక్షలకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయడంతో పాటు అవసరమైన విద్యార్థులకు నిరంతర ఫాలోఅప్ సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పాఠశాల స్థాయిలోనే ఆరోగ్య సమస్యలను గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభ్యాసానికి మెరుగైన పరిస్థితులు కల్పించవచ్చని డీఎంహెచ్ఓ పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నాగేందర్‌బాబు, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ నయీమ్‌జహా, డాక్టర్ సంపత్‌కుమార్, డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, డీపీఓ ఎన్‌హెచ్‌ఎం రాజేందర్, వైద్యాధికారులు, ఫార్మసిస్టులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

## కాళోజీ కలం స్ఫూర్తి.. యూనిఫామ్ నమ్మకానికి ప్రతీక కావాలి

- **బాధితులకు న్యాయం చేయడమే కాళోజీకి నిజమైన నివాళి**
- **రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా**



**ప్రజానావ, రామగుండం :** ప్రజల కోసం ప్రశ్నించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు కలం పోలీసులకు స్ఫూర్తిగా నిలవాలని, ప్రజల భద్రత కోసం పనిచేసే పోలీస్ యూనిఫామ్ ప్రజల నమ్మకానికి ప్రతీకగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ యాస, భాషలో సామాజిక అంశాలను తన రచనల ద్వారా ప్రజలకు చేరువ చేసి వారిలో చైతన్యం నింపిన గొప్ప ప్రజాకవి కాళోజీ అని కొనియాడారు. కాళోజీ కేవలం కవి మాత్రమే కాదని, సామాన్య ప్రజల సమస్యలను తన రచనల ద్వారా బలంగా వినిపించిన ప్రజా గొంతుకగా నిలిచారని పేర్కొన్నారు. సామాన్యుడి భాషలో సామాన్యుడి జీవితం, సమస్యలను ప్రతిబింబిస్తూ సామాజిక అన్యాయం, అసమానతలు, దోపిడీ, నిరంకుశత్వాన్ని ప్రశ్నించే చైతన్యాన్ని కాళోజీ తన రచనల ద్వారా కలిగించారని తెలిపారు. 'నా గొడవ' వంటి రచనలు ఆయన ప్రజా చైతన్యానికి ప్రతీకలుగా నిలిచాయని అన్నారు. ప్రజా సేవ, సాహిత్యం, సామాజిక చైతన్యానికి కాళోజీ చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయనను పద్మవిభూషణ్ పురస్కారంతో సత్కరించిందని తెలిపారు. కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల సమస్యలను ఓపికగా వినడం, బాధితులకు న్యాయం చేయడం, బలహీన వర్గాలకు అండగా నిలవడం, విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధతతో వ్యవహరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని సీపీ పేర్కొన్నారు. "ప్రజల కోసం ప్రశ్నించిన కాళోజీ కలం మనకు స్ఫూర్తి అయితే.. ప్రజల భద్రత కోసం పనిచేసే మన యూనిఫామ్ ప్రజల నమ్మకానికి ప్రతీకగా నిలవాలి" అని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత చేరువగా, బాధ్యతాయుతంగా, మానవీయ దృక్పథంతో పోలీసింగ్ అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏవో శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు భీమేశ్, శ్రీనివాస్, ఆర్ఐలు శేఖర్, రమేష్, సీసీ సందీప్, ఆర్ఎస్ఐలు ప్రవీణ్, శివతోపాటు పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు.

## భీమేశ్వర ఆలయంలో ఈవో రమాదేవి తనిఖీలు




**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని ఈవో ఎల్. రమాదేవి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తులకు అందుతున్న సౌకర్యాలు, దర్శనం, ప్రసాదం పంపిణీ, అన్నదాన సత్రం నిర్వహణను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. లడ్డూ ప్రసాదం నాణ్యత, నిర్దేశిత బరువును స్వయంగా తూకం వేసి పరిశీలించిన ఆమె.. కౌంటర్ల వద్ద భక్తులకు ఎలాంటి జాప్యం, అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు. ఆలయంలో భక్తుల నుంచి అక్రమంగా నగదు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆలయ పరిసరాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈవో వెంట ఏఈవో నాగుల మహేష్, ఏఈవో నాగుల మహేష్, ఆలయ పర్యవేక్షకులు నరేందర్, భాస్కర్, శివసాయి, రాజేందర్, పీఆర్వో పెరిక శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాస్, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# చైనాలో ట్యాంక్ పేలుడు

- ఇద్దరు బంగ్లా సైనికులు మృతి
- సైనిక విన్యాసాల్లో ఘటన
- మరో ఆర్మీ అధికారి తీవ్రంగా గాయపాటు



**ఢాకా :** బంగ్లాదేశ్‌లో సైనిక విన్యాసాల సందర్భంగా ఆ దేశ ఆర్మీ వినియోగిస్తున్న చైనా తయారీ ట్యాంక్ పేలిపోవడంతో ఇద్దరు సైనికులు మృతి చెందారు. మరో సీనియర్ ఆర్మీ అధికారి తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం చట్టోగ్రామ్‌లోని హథజారి ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో బంగ్లాదేశ్ ఆర్మీ సైనిక విన్యాసాలు నిర్వహించింది. ఈ సందర్భంగా చైనాకు చెందిన టైప్–59 ట్యాంక్ నుంచి ఫైరింగ్ చేస్తుండగా ఒక్కసారిగా యుద్ధ ట్యాంక్ పేలిపోయింది. ఈ ప్రమాదంలో ట్యాంక్‌లో ఉన్న ఇద్దరు బంగ్లాదేశ్ సైనికులు మృతి చెందగా.. మరో సీనియర్ ఆర్మీ అధికారి తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను మెరుగైన చికిత్స కోసం హెలికాప్టర్‌లో ఢాకాలోని కంబైన్డ్ మిలిటరీ హాస్పిటల్‌కు తరలించారు. చైనా తయారీ టైప్–59 (టీ–59) రకానికి చెందిన ట్యాంకులను బంగ్లాదేశ్ ఆర్మీ వినియోగిస్తోంది. అయితే సైనిక విన్యాసాల సమయంలో ట్యాంక్ పేలడానికి గల కచ్చితమైన కారణం ఇంకా నిర్ధారణ కాలేదు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను గుర్తించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు బంగ్లాదేశ్ ఆర్మీకి చెందిన అంతర సేవల ప్రజా సంబంధాల డైరెక్టరేట్ (ఐఎస్‌పీఆర్) వెల్లడించింది. ఇదిలా ఉండగా.. మిలిటరీ డ్రిల్ సందర్భంగా చైనా తయారీ యుద్ధ ట్యాంక్ పేలిపోయిన దృశ్యాలకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# సింగపూర్ ప్రధాని జీతం రూ.27 కోట్లు

- 60 శాతానికిపైగా పెరగనున్న వేతనం
- రాజకీయ నేతల జీతాల పెంపునకు స్వతంత్ర కమిటీ సిఫార్సులు



**సింగపూర్:** ప్రపంచ దేశాల ప్రధానుల వేతనాలను పరిశీలిస్తే భారీ వ్యత్యాసం కనిపిస్తుంది. ఇప్పటికే ప్రపంచంలోనే అత్యధిక వేతనం అందుకుంటున్న సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ జీతం మరింత పెరగనుంది. రాజకీయ నేతల వేతనాలను పెంచుతున్నట్లు వాంగ్ మంగళవారం పార్లమెంటులో ప్రకటించారు. దీంతో సింగపూర్ రాజకీయ నేతల జీతాలు 60 శాతానికిపైగా పెరగనున్నాయి. ప్రస్తుతం ప్రధాని వార్షిక బెంచ్‌మార్క్ వేతనం 2.2 మిలియన్ సింగపూర్ డాలర్లు కాగా.. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.16.5 కోట్లు. తాజా పెంపుతో ఈ వేతనం 3.6 మిలియన్ సింగపూర్ డాలర్లకు, అంటే సుమారు రూ.27 కోట్లకు చేరనుంది. దీంతో ప్రధాని వార్షిక జీతం దాదాపు రూ.10.5 కోట్లు పెరగనుంది. డిప్యూటీ ప్రధాని వేతనం కూడా 1.87 మిలియన్ సింగపూర్ డాలర్ల నుంచి 3.06 మిలియన్ డాలర్లకు పెరగనుంది. భారత కరెన్సీలో ప్రస్తుతం సుమారు రూ.14 కోట్లుగా ఉన్న ఈ వేతనం రూ.23 కోట్లకు చేరుతుంది. క్యాబినెట్ మంత్రుల వేతనాలు 1.80 మిలియన్ నుంచి 2.88 మిలియన్ సింగపూర్ డాలర్ల వరకు పెరగనున్నాయి. అంటే భారత కరెన్సీలో సుమారు రూ.13.5 కోట్ల నుంచి రూ.21.6 కోట్ల వరకు చెల్లించనున్నారు. తనకు పెరిగే మొత్తాన్ని పదవీకాలంలో వివిధ కార్యక్రమాలకు విరాళంగా ఇస్తానని లారెన్స్ వాంగ్ తెలిపారు. రాజకీయ నేతల వేతనాల పెంపు ప్రజల్లో భావోద్వేగ పూరిత అంశమని, సామాన్యుల ఆదాయంతో పోలిస్తే నేతల జీతాలు చాలా ఎక్కువగా ఉండటంతో ప్రజలు వాటిని నిశితం గా పరిశీలించడం సహజమేనని ఆయన పేర్కొన్నారు. మంచి పాలనకు సమర్థ నాయకత్వం అవసరమని, భవిష్యత్తులో దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు నాణ్యమైన నాయకత్వాన్ని కొనసాగించడమే తమ లక్ష్యమని వాంగ్ వివరించారు. మంత్రి వేతనాల పెంపు స్వతంత్ర కమిటీ చేసిన సిఫార్సుల మేరకు చేపట్టినట్లు తెలిపారు. అయితే కొత్త వేతనాలను ప్రస్తుతం పదవుల్లో ఉన్నవారికి వెంటనే అమలు చేయరు. అక్టోబర్ 15 నుంచి వ్యక్తిగత పరిస్థితులు, పనితీరును పరిగణనలోకి తీసుకుని గరిష్ఠంగా 9 శాతం వరకు ఒకేసారి సర్దుబాటు చేస్తారు. ఇకపై రాజకీయ నేతల వేతనాల్లో మార్పులు వారి పనితీరు, బాధ్యతల ఆధారంగానే ఉంటాయని వాంగ్ స్పష్టం చేశారు.

# శ్రీలంక జైలు అల్లర్లలో కేరళ వాసి మృతి

**కొలంబో :** శ్రీలంకలో అరెస్టయిన కేరళకు చెందిన 73 ఏళ్ల ఉన్నికృష్ణన్ ఎస్ జైలు అల్లర్లలో మృతి చెందారు. పోలీసుల రక్షణ మధ్య ఆయన మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించినట్లు దర్యాప్తు అధికారులు నెగోంబో మేజిస్ట్రేట్ కోర్టుకు తెలిపారు. కేరళకు చెందిన ఉన్నికృష్ణన్ గత నాలుగు దశాబ్దాలుగా కుటుంబంతో కలిసి చెన్నైలో నివసిస్తు న్నారు. మార్చి 2న శ్రీలంక వెళ్లిన ఆయనను గంజా యి కలిగి ఉన్నారనే ఆరోపణలతో అక్కడి పోలీసులు అరెస్టు చేసి నెగోంబో జైలుకు తరలించారు. జూలై 5, 6 తేదీల్లో మాదకద్రవ్యాల విషయంలో ఖైదీల ప్రత్యర్థి వర్గాల మధ్య తలెత్తిన వివాదం తీవ్ర ఘర్షణకు దారితీసింది. ఈ హింసాకాండలో ఉన్నికృష్ణన్‌తో పాటు 22 మంది ఖైదీలు, 10 మంది జైలు అధికారులు మృతి చెందగా .. మరో వంద మంది గాయపడ్డారు. ఘటనపై శ్రీలంక సీఐడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. కోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 2న ఉన్నికృష్ణన్ మృతదేహానికి పోలీసుల రక్షణ మధ్య ప్రభుత్వ ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహించినట్లు సీఐడీ అధికారులు మంగళవారం కోర్టుకు వెల్లడించారు. కొలంబోలోని భారత హైకమి షన్ అధికారులు అంత్యక్రియల్లో పాల్గొన్నట్లు తెలి పారు.

# బ్రేకప్‌తో బయటపడిన పేపర్ లీక్

- ప్రేమికుల జంటకు విద్యార్థుల కృతజ్ఞతలు
- పోస్టర్లతో వినూత్న నిరసన




**ముంబై :** ఓ ప్రేమజంట మధ్య జరిగిన బ్రేకప్ కారణంగా మహారాష్ట్రలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ నియామక పరీక్ష పేపర్ లీక్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో పరీక్షల అక్రమాలపై నిరసన చేస్తున్న విద్యార్థులు ఆ ప్రేమికుల జంటకు కృతజ్ఞతలు తెలుపుతూ వినూత్నంగా పోస్టర్లు ప్రదర్శించారు. మహారాష్ట్రలోని ఆరు డివిజన్ల పరిధిలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ నియామకం కోసం మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపీఎస్సీ) ఆఫ్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించింది. అనంతరం ఫలితాలు ప్రకటించగా 506 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు అర్హత సాధించారు. అయితే పరీక్షకు రెండు రోజుల ముందే ప్రశ్నపత్రం లీకైనట్లు ఆరోపణలు వచ్చాయి. నందుర్బార్‌కు చెందిన కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకుడు ప్రవీణ్ పాటిల్ నుంచి తన కుమార్తె రితుజా పాటిల్ కోసం ఆమె తండ్రి అమృత్ పాటిల్ ప్రశ్నపత్రాన్ని కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. లీకైన పేపర్‌ను రితుజా తన ప్రియుడు గౌరవ్ పాటిల్‌కు షేర్ చేసింది. పరీక్ష ఫలితాల్లో రితుజా ఉత్తీర్ణత సాధించగా.. గౌరవ్ మాత్రం విఫలమయ్యాడు. దీంతో ఇద్దరి మధ్య విభేదాలు తీవ్రం కావడంతో చివరకు విడిపోయారు. రితుజాకు ప్రభుత్వ ఉద్యోగం వస్తే తనకంటే ఆమె ముందుకు వెళ్తుందనే ఆందోళనతో గౌరవ్.. ప్రశ్నపత్రం లీక్‌పై ఎంపీఎస్సీకి ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేశాడు. అనంతరం ఫిర్యాదును ఉపసంహరించుకునేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే దర్యాప్తు ప్రారంభమైంది. విచారణలో రితుజా తండ్రి కొనుగోలు చేసిన ప్రశ్నపత్రం ప్రవీణ్ పాటిల్‌కు చేరడం వెనుక కొంతమంది ఎంపీఎస్సీ అధికారుల ప్రమేయం ఉన్నట్లు బయటపడింది. ఈ వ్యవహారంలో రూ.12 లక్షల వరకు నగదు లావాదేవీలు జరిగినట్లు గుర్తించిన దర్యాప్తు అధికారులు ఆరుగురిని అరెస్టు చేశారు. దీంతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గ్రూప్–బి పోస్టుల నియామక ప్రక్రియను ఎంపీఎస్సీ రద్దు చేసింది. పేపర్ లీక్ వ్యవహారంపై మహారాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఆందోళనలు చేపట్టారు. లీక్‌కు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎంపీఎస్సీ చైర్మన్ వివేక్ భీమన్వార్, కార్యదర్శి మహేంద్ర హర్పాల్కర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 2022 నుంచి నిర్వహించిన అన్ని పరీక్షలపై స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని కోరుతున్నారు. మరోవైపు నాగ్‌పూర్‌లోని సంవిధాన్ చౌక్‌లో విద్యార్థులు వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రేమికులైన రితుజా, గౌరవ్ విడిపోవడం వల్లే పేపర్ లీక్ వ్యవహారం వెలుగులోకి వచ్చిందని పేర్కొంటూ వారికి కృతజ్ఞతలు తెలిపే పోస్టర్లను ప్రదర్శించారు. వారు విడిపోకపోయి ఉంటే పరీక్షల అక్రమాల వెనుక ఉన్న పూర్తి నిజం వెలుగులోకి వచ్చేది కాదని విద్యార్థులు అన్నారు. వారి బ్రేకప్ కారణంగానే పేపర్ లీక్‌కు సంబంధించిన అనేక చాట్లు, కాల్ రికార్డింగ్‌లు, ఇతర కీలక వివరాలు దర్యాప్తు అధికారులకు లభించాయని పేర్కొంటూ ఆ జంటకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## సీజేపీ ఆందోళనకారుడికి

# నోటీసులపై సుప్రీం ఆగ్రహం

- చర్యలు తీసుకోవద్దని ఆదేశించినా నోటీసులెలా ఇస్తారు?
- మెజిస్ట్రేట్‌కు వివరణ ఇవ్వాలని ఆదేశం



**న్యూఢిల్లీ :** సీజేపీ ఆందోళనకారులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశించినప్పటికీ.. ఆ ఆందోళనలో పాల్గొన్న ఓ విద్యార్థికి మెజిస్ట్రేట్ నోటీసులు జారీ చేయడంపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. తాము స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన తర్వాత కూడా విద్యార్థికి నోటీసులు ఎలా జారీ చేస్తారని మెజిస్ట్రేట్ ను ప్రశ్నించింది. మెజిస్ట్రేట్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం.. నోటీసులు జారీ చేయడానికి గల కారణాలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. జూలైలో జరిగిన సీజేపీ ఆందోళన సందర్భంగా హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడంతో ఢిల్లీతోపాటు దేశవ్యా ప్తంగా పలువురు ఆందోళనకా రులపై కేసులు నమోదయ్యాయి. ఆ కేసులను రద్దు చేయాలని ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరగా.. తన విశేష అధికారాలను ఉపయోగించిన సుప్రీంకోర్టు ఆందోళనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసింది. అంతేకాకుండా ఉద్యమకారులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సెప్టెంబర్ 1న ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలు అమల్లో ఉన్నప్పటికీ గ్రేటర్ నోయిడాకు చెందిన ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ సీజేపీ ఆందోళనలో పాల్గొన్న గౌతమ్ బుద్ధా యూనివర్సిటీ విద్యార్థి అక్షత్ త్రిపాఠికి సెప్టెంబర్ 4న నోటీసులు జారీ చేశారు. సీజేపీ ఆందోళనలో పాల్గొన్న అక్షత్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులు గ్రేటర్ నోయిడా మెజిస్ట్రేట్‌ను కోరడంతో ఆయన నోటీసులు జారీ చేశారు. ఇకపై ఎలాంటి ఆందోళనల్లో పాల్గొనకుండా శాం తియుతంగా ఉంటానని హామీ ఇస్తూ రూ.5 లక్షల బాండ్ సమర్పించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే మరుసటి రోజే ఆ నోటీసులను కోర్టు ఉపసం హరించుకుంది. అయినప్పటికీ ఈ వ్యవహారంపై బాధిత విద్యార్థి తరఫు న్యాయవా దులు సుప్రీంకో ర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి, జస్టిస్ వీ.మోహన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఆందోళ నకారులపై చర్యలు తీసుకోవ ద్దని తాము స్పష్టంగా ఆదేశించిన తర్వాత కూడా విద్యార్థికి నోటీసులు జారీ చేయడంపై ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా నోటీసులు జారీ చేయ డానికి మెజిస్ట్రేట్‌కు ఎంత ధైర్యమని ప్రశ్నించింది. తమ ఆదేశాలను ధిక్కరించేలా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం.. నోటీసులు జారీ చేసిన తీరుపై మెజిస్ట్రేట్ వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

# లంచాలకు కొత్త కోడ్‌లు

- ఒక బస్తా బియ్యం'.. 'ఒక పెట్టె'.. 'నూనె, నీరు' అంటూ డిమాండ్లు
- బిహార్‌లో బయటపడుతున్న అవినీతి బాగోతాలు

**పాట్నా :** బిహార్‌లోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో లంచగొండి ఉద్యోగులు, అధికారులు తమ వ్యవహారాలకు కొత్త కోడ్ భాషను ఉపయోగిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. నేరుగా ఫోన్‌లోగానీ, ముఖాముఖిగాగానీ లంచం అడగకుండా 'ఏక్ బోరా చావల్' (ఒక బస్తా బియ్యం), 'ఏక్ పేటీ' (ఒక పెట్టె), 'తేల్ పానీ' (నూనె, నీరు) వంటి కోడ్ పదాలను వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఓ దౌర్జన్యం కేసులో పోలీస్‌స్టేషన్ రికార్డుల నుంచి తన కుమారుడి పేరును తొలగించేందుకు పోలీసులు 'ఏక్ బోరా చావల్' అడిగారని, అంటే రూ.లక్ష లంచం డిమాండ్ చేశారని ఓ బాధితుడి తల్లి ఆరోపించింది. ఇదిలా ఉండగా.. ఇటీవల రెవెన్యూ, భూ సంస్కరణల శాఖ అధికారి కాంచన్ కుమారిని విజిలెన్స్ అధికారులు అరెస్ట్ చేశారు. ప్రభుత్వ రికార్డుల్లోని వివరాలను మార్చేందుకు ఆమె ఓ వ్యక్తి నుంచి వాషింగ్ మెషీన్‌తోపాటు రూ.2 లక్షల నగదును తన పనిమనిషి ద్వారా లంచంగా స్వీకరించినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఆమెపై చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనలతో బిహార్‌లో లంచాల స్వీకరణకు అవినీతి అధికారులు వినూత్న కోడ్‌లను ఉపయోగిస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది.

# బంగ్లాదేశ్‌లో ఇద్దరు హిందువుల దారుణ హత్య

- వేర్వేరు ఘటనల్లో హిందూ స్వర్ణకారుడు, మహిళ మృతి
- మైనారిటీల భద్రతపై ఆందోళన

**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులు ఆందోళనకరంగా మారుతున్న వేళ వేర్వేరు ఘటనల్లో ఇద్దరు హిందువులు దారుణ హత్యకు గురయ్యారు. మృతుల్లో ఓ మహిళ కూడా ఉన్నారు. తాజా ఘటనలతో బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీల భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నా యి. నౌగావ్ జిల్లా మహాదేవ్‌పూర్‌లో 45 ఏళ్ల హిందూ స్వర్ణకారుడు అలీఫ్ చంద్ర దత్తా హత్యకు గురయ్యాడు. సోమవారం రాత్రి 8.30 గంటలకు మహాదేవ్‌పూర్ బజార్‌లోని తన నగల దుకాణం నుంచి ఇంటికి బయలుదేరిన దత్తా.. రాత్రి 9 గంటల సమయంలో దులాల్‌పారా ప్రాంతానికి చేరుకోగానే కొందరు దుండగులు అడ్డుకున్నారు. పదునైన ఆయుధంతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన అనంతరం అతడి వద్ద ఉన్న బంగారం, 7 లక్షల బంగ్లాదేశ్ టాకాలను దోచుకుని పరారయ్యారు. తీవ్ర గాయాలతో ఉన్న దత్తాను కుటుంబసభ్యులు, స్థానికులు రాజ్‌షాహీ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇది కేవలం దోపిడీ కోసమే జరిగిన ఘటననా? లేక మరేదైనా కక్ష ఉందా? అన్నది ఇంకా తేలాల్సి ఉందని మహాదేవ్ పూర్ పోలీసులు తెలిపారు. మరోవైపు కాక్స్‌బజార్ జిల్లా మహేశ్‌ఖాలీ ఉపజిల్లాలో 45 ఏళ్ల హిందూ మహిళ రాణి సుశీల్ హత్యకు గురయ్యారు. సోమవారం రాత్రి 7.30 గంటల సమయంలో హోనాక్ యూనియన్‌లోని తన ఇంట్లో ఆమె వంట చేస్తుండగా.. దొంగతనం కోసం ఓ గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడేందుకు ప్రయత్నించాడు. అతడిని గమనించిన రాణి కేకలు వేయడంతో ఆమె ముఖాన్ని పట్టుకుని పలుమార్లు కత్తితో పొడిచి నిందితుడు పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన రాణిని చకారియా ఆసుపత్రికి తరలించగా.. కొద్దిసేపటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ ఘటనలకు కొద్ది రోజుల ముందే రంగ్‌పూర్‌లో రిటైర్డ్ హిందూ ఉపాధ్యాయుడు గణపతి చక్రవర్తి, ఆయన కుటుంబానికి చెందిన మరో ముగ్గురు హత్యకు గురయ్యారు. బంగ్లాదేశ్‌లో హిందువులతో పాటు ఇతర మైనారిటీలపై దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో తాజాగా జరిగిన ఈ హత్యలు మరింత కలకలం రేపుతున్నాయి.

# మైనర్ బాలుడిని ముద్దుపెట్టుకున్న యువతిపై పోక్సో కేసు

**ప్రజానావ, ముంబై:** పూణెలోని తలేగావ్ దభాడే ప్రాంతంలో 17 ఏళ్ల మైనర్ బాలుడిని కేఫ్‌లో ముద్దుపెట్టుకున్న 21 ఏళ్ల యువతిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాలుడితో ప్రేమలో ఉన్న యువతి సెప్టెంబర్ 3న కేఫ్‌లో అతడిని ముద్దుపెట్టుకున్నట్లు సమాచారం. మరుసటి రోజు బాలుడి ఇంటికి వెళ్లి పెళ్లి చేసుకోవాలని కోరినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై బాలుడి 47 ఏళ్ల తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాలుడు, యువతి దూరపు బంధువులని, గత 8–9 నెలలుగా పరిచయం ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

# టిబెట్‌లో భూకంపం.. నేపాల్‌లో ప్రకంపనలు

- 5.3గా తీవ్రత నమోదు.. భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసిన ప్రజలు

**టిబెట్ :** టిబెట్‌లో బుధవారం భారీ భూకంపం సంభవించింది. దీని ప్రభావంతో పొరుగు దేశమైన నేపాల్‌లోనూ పలు ప్రాంతాల్లో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. యూరోపియన్–మెడిటరేనియన్ సిస్మోలాజికల్ సెంటర్ (ఈఎంఎస్‌సీ) ప్రకారం రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 5.3గా నమోదైంది. భూ అంతర్భాగంలో 35 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు ఈఎంఎస్‌సీ వెల్లడించింది. అయితే భారత జాతీయ భూకంప పరిశోధన కేంద్రం భూకంప తీవ్రతను 5.0గా నిర్ధారించింది. టిబెట్‌లో సంభవించిన భూకంపం కారణంగా నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో భూమి కంపించడంతో భయాందోళనకు గురైన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన అధికారిక వివరాలు వెలువడలేదు. కాగా గత గురువారం కూడా టిబెట్‌లో భూకంపం సంభవించింది. అప్పట్లో రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.1గా నమోదైనట్లు, భూకంప కేంద్రం 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ సర్వే (యూఎస్‌జీఎస్) వెల్లడించింది.



# ఏడు రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- తెలంగాణలో ఘట్‌కేసర్–కాజీపేట నాలుగో లైన్‌కు ఆమోదం
- ఏపీలో అరక్కోణం–రేణిగుంట సెక్షన్‌లో 3,4వ లైన్లు

**న్యూఢిల్లీ :** దేశంలోని ఏడు కీలక రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కో ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతాతోపాటు బిలాస్‌పూర్, కాంతి నగరాలను అనుసంధానించేలా ఈ ప్రాజెక్టులు చేపట్టనున్నారు. ఇప్పటికే మూడు రైల్వే లైన్లు ఉన్న పలు మార్గాల్లో నాలుగో లైన్ ఏర్పాటు చేయడానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆయా ప్రాజెక్టుల్లో ఇప్పటికే సుమారు 2,000 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయని, మరో 5,000 కిలోమీటర్ల పనులు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. అదేవిధంగా మరో 4,000 కిలోమీటర్ల మేర రైల్వే పనులకు సంబంధించిన డీపీఆర్‌లను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణకు సంబంధించి ఘట్‌కేసర్–కాజీపేట మధ్య 110 కిలోమీటర్ల పొడవున నాలుగో రైల్వే లైన్ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.2,419 కోట్లుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్‌లో అరక్కోణం–రేణిగుంట సెక్షన్‌లో 77 కిలోమీటర్ల మేర మూడో, నాలుగో రైల్వే లైన్ల నిర్మాణానికి ఆమోదం లభించింది. మొత్తంగా దక్షిణ భారతదేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులను చేపట్టేందుకు కేంద్రం అనుమతించింది. ఈ ప్రాజెక్టులతో రైళ్ల రాకపోకల సామర్థ్యం పెరగడంతోపాటు కీలక మార్గాల్లో ప్రయాణికులు, సరుకు రవాణాకు మరింత సౌలభ్యం కలగనుంది.

# మసూద్ అజార్ ఎక్కడ?.. పాక్‌లో లేడంటున్న పాక్

**ఆఫ్ఘన్‌లో లేడంటున్న తాలిబన్ ప్రభుత్వం**



**పాకిస్థాన్ :** జైషే మహమ్మద్ వ్యవస్థాపకుడు, కరుడుగట్టిన ఉగ్రవాది మసూద్ అజార్ ప్రస్తుతం ఎక్కడ ఉన్నాడన్న దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. భారత్‌లో జరిగిన పలు కీలక ఉగ్రదాడులకు ప్రధాన సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మసూద్ అజార్ పాకిస్థాన్‌లోనే తలదాచుకున్నాడని భారత్ సహా పలు దేశాలు ఆరోపిస్తున్నాయి. అయితే పాకిస్థాన్ మాత్రం అతడు తమ దేశంలో లేడని, ఆఫ్ఘనిస్థాన్‌కు వెళ్లిపోయాడని కొన్నేళ్లుగా చెబుతోంది. తాజాగా ఈ వాదనపై ఆఫ్ఘనిస్థాన్ స్పందిస్తూ.. మసూద్ అజార్ తమ దేశంలో లేడని స్పష్టం చేసింది. ఇతర దేశాలపై దాడులకు, కుట్రలకు తమ భూభాగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించుకో నివ్వబోమని ఆఫ్ఘన్ విదేశాంగ శాఖ వెల్లడించింది. భారత్‌లో 2001లో పార్లమెంట్‌పై జరిగిన దాడి, 2008 ముంబై ఉగ్రదాడులు, 2016 పఠాన్‌కోట్ వైమానిక స్థావరంపై దాడి, 2019 పుల్వామా ఉగ్రదాడి వంటి ఘటనల్లో జైషే మహమ్మద్ ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ సంస్థను నడిపిస్తూ ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చి, భారత్‌పై దాడులకు ప్రోత్సహించింది మసూద్ అజారేనని భారత దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2019లో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అతడిని అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. మసూద్ అజార్‌కు ఆశ్రయం కల్పిస్తున్నారనే ఆరోపణలతో పాకిస్థాన్‌పై అంతర్జాతీయంగా ఒత్తిడి కూడా పెరిగింది. ఉగ్రవాదులకు ఆర్థిక సహకారం అందకుండా చర్యలు తీసుకునే ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) గతంలో పాకిస్థాన్‌ను గ్రే లిస్ట్‌లో ఉంచింది. ఉగ్రవాద సంస్థలపై చర్యలు తీసుకోవాలంటే మసూద్ అజార్‌ను అరెస్టు చేయాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ.. 2019 నుంచి అతడు పాకిస్థాన్‌ను వీడి ఆఫ్ఘనిస్థాన్‌కు వెళ్లిపోయాడని పాక్ వాదిస్తోంది. 2022లో తాలిబన్లు ఆఫ్ఘనిస్థాన్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా మసూద్ అజార్ తమ దేశంలో లేడని స్పష్టం చేశారు. దీంతో పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ రెండూ అతడు తమ దేశంలో లేడని చెబుతుండగా.. అసలు మసూద్ అజార్ ప్రస్తుతం ఎక్కడ ఉన్నాడన్నది మాత్రం ఇప్పటికీ మిస్టరీగానే మిగిలింది.



# బాత్రూమ్‌లోకి కూడా వస్తారా?

- మీడియాపై పినరయి విజయన్ ఆగ్రహం
- ఈడీ కేసుపై ప్రశ్నలతో వెంటపడిన విలేకరులు
- మాట్లాడకుండానే కారెక్కి వెళ్లిపోయిన మాజీ సీఎం

**తిరువనంతపురం :** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసుపై ప్రశ్నలు అడిగేందుకు మీడియా ప్రతినిధులు వెంటపడటంతో కేరళ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత పినరయి విజయన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "నేను ఎక్కడికి వెళితే అక్కడికి వస్తారా.. బాత్రూమ్‌లోకి వెళ్లినా వదలరా?" అంటూ విలేకరులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం చంగనచేరికి వెళ్తున్న విజయన్ మార్గమధ్యంలో కల్లిస్సేరిలోని పీడబ్ల్యూడీ రెస్ట్‌హౌస్‌లో మధ్యాహ్నం ఆగారు. అప్పటికే అక్కడ వేచి ఉన్న మీడియా ప్రతినిధులు ఆయన కారు దిగగానే చుట్టుముట్టి ఈడీ కేసుపై ప్రశ్నలు సంధించారు. అయితే విజయన్ స్పందించకుండా రెస్ట్‌హౌస్‌లోకి వెళ్లారు. విలేకరులు ఆయనను అనుసరిస్తూ లోపలికి వెళ్లి మళ్లీ ప్రశ్నలు వేయడంతో తీవ్ర అసహనానికి గురైన ఆయన వాష్‌రూమ్‌లోకి వెళ్లే ముందు వెనక్కి తిరిగి.. "నేను ఇక్కడికి వచ్చింది మిమ్మల్ని కలవడానికి కాదు. నేను ఎక్కడికి వెళితే అక్కడికి వస్తారా.. బాత్రూమ్‌లోకి వెళ్లినా వదలరా?" అంటూ మండిపడ్డారు. అనంతరం గదిలోకి వెళ్లిపోయారు. కాసేపటి తర్వాత బయటకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడకుండానే వాహనంలో చంగనచేరికి వెళ్లిపోయారు. కాగా పినరయి విజయన్, ఆయన కుమార్తె టీ. వీణ, అల్లుడు, ఎమ్మెల్యే పీఏ మహమ్మద్ రియాస్‌పై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరుతూ ఈడీ ఇటీవల కేరళ రాష్ట్ర పోలీస్ చీఫ్‌కు సిఫార్సు చేసింది. మనీలాం డరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 66(2) ప్రకారం తన దర్యాప్తులో సేకరించిన వివరాలు, ఆధారాలను పోలీసులకు పంపింది. ఈ నేపథ్యంలో విజయన్ నుంచి వివరణ రాబట్టేందుకు మీడియా ప్రతినిధులు ప్రయత్నించగా ఈ ఘటన చోటుచేసుకుంది. మీడియాపై విజయన్ ఆగ్రహం వ్యక్తం చేయడం ఇదే తొలిసారి కాదు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న వారపు కేబినెట్ అనంతర మీడియా సమావేశాన్ని రద్దు చేశారు. 2017లో తిరువనంతపురంలో బీజేపీ–ఆర్ఎస్ఎస్ నేతలతో సమావేశానికి వెళ్లిన సందర్భంగా మీడియా ప్రతినిధులను 'బయటకు వెళ్లండి' అంటూ మందలిం చారు. తాజాగా మరోసారి మీడియా ప్రతినిధులపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది.

# అల్కరాజ్‌కు షెల్టన్ షాక్!

- డిఫెండింగ్ చాంపియన్‌ను ఓడించి సెమీస్‌కు చేరిన అమెరికా ఆటగాడు
- యూఎస్ ఓపెన్ చరిత్రలో అత్యంత ఆలస్యంగా ముగిసిన మ్యాచ్



**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్‌లో డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కరాజ్‌కు అమెరికా ఆటగాడు బెన్ షెల్టన్ షాకిచ్చాడు. హోరాహోరీగా సాగిన ఐదు సెట్ల పోరులో 6–7(5), 6–1, 6–3, 1–6, 7–6(10–7)తో అల్కరాజ్‌ను ఓడించి సెమీఫైనల్‌కు చేరాడు. 4 గంటల 28 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్ యూఎస్ ఓపెన్ చరిత్రలోనే అత్యంత ఆలస్యంగా ముగిసిన మ్యాచ్‌గా నిలిచింది. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 3.33 గంటలకు మ్యాచ్ ముగిసింది. నిర్ణయాత్మక ఐదో సెట్ టైబ్రేకర్‌లో 3–5తో వెనుకబడిన షెల్టన్.. శక్తివంతమైన సర్వీస్‌లతో పుంజుకుని చివర్లో గంటకు 146 మైళ్ల వేగంతో ఏస్ సంధించి విజయాన్ని ఖాయం చేసుకున్నాడు. దీంతో గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో అల్కరాజ్ 18 మ్యాచ్‌ల విజయ పరంపరకు తెరపడింది. సెమీఫైనల్లో 11వ సీడ్ ఫ్రాన్సిస్ టియాఫోతో షెల్టన్ తలపడనున్నాడు. మరో క్వార్టర్ ఫైనల్లో టియాఫో 5–7, 3–6, 7–5, 6–3, 7–6(10–6)తో అలెక్స్ మిచెల్‌సన్‌ను ఓడించాడు. దీంతో యూఎస్ ఓపెన్ పురుషుల ఫైనల్లో ఈసారి అమెరికా ఆటగాడు ఉండటం ఖాయమైంది. గాయం నుంచి కోలుకుని ఏప్రిల్ తర్వాత తొలిసారి బరిలోకి దిగిన అల్కరాజ్.. 'గెలవాలనుకున్నా.. పోరాడిన తీరుపై గర్వంగా ఉంది. తలెత్తుకుని టోర్నీ నుంచి వెళ్తున్నా' అని పేర్కొన్నాడు. షెల్టన్‌కు ఇది మూడో గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్.

# టైటిల్‌కు చేరువగా ఈస్ట్ జోన్

- సౌత్ జోన్‌పై 584 పరుగుల ఆధిక్యం
- మరోసారి రాణించిన ఇషాన్ కిషన్
- పరుగు తేడాతో సెంచరీ చేజార్చుకున్న తిలక్ వర్మ



**చెన్నై:** దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్ టైటిల్‌కు చేరువైంది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 212/5తో నిలిచి.. ఓవరాల్‌గా 584 పరుగుల ఆధిక్యం సాధించింది. అంతకుముందు ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 708 పరుగులు చేయగా.. సౌత్ జోన్ 336 పరుగులకే ఆలౌటైంది. రెడ్‌బాల్ క్రికెట్‌లో ఇషాన్ కిషన్, తిలక్ వర్మ ఆకట్టుకున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో 270 పరుగులు చేసిన కిషన్.. రెండో ఇన్నింగ్స్‌లోనూ 98 బంతుల్లో 80 పరుగులు చేశాడు. సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ 211 బంతుల్లో 99 పరుగులు చేసి త్రుటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. సెమీఫైనల్లో సెంచరీ చేసిన తిలక్.. వరుసగా రెండో శతకానికి ఒక్క పరుగు దూరంలో నిలిచాడు. ఈస్ట్ జోన్ బ్యాటర్లు కుమార్ కుశాగ్ర (34), కౌనైన్ ఖురైషీ (26) క్రీజులో ఉండగా.. ఆరో వికెట్‌కు అజేయంగా 52 పరుగులు జోడించారు. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన భారీ ఆధిక్యంతో ఈస్ట్ జోన్ టైటిల్ దాదాపు ఖాయం చేసుకుంది.

### మళ్లీ గాడిలోకి సిరాజ్

సౌత్ జోన్ పేసర్ మహ్మద్ సిరాజ్ రెండో ఇన్నింగ్స్‌లో మెరుగ్గా బౌలింగ్ చేశాడు. వేగం, కచ్చితత్వం, సరైన లెంగ్త్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్‌ను దేవదత్ పడిక్కల్ చేతికి క్యాచ్ ఇచ్చేలా చేసి వికెట్ సాధించాడు.



# శ్రీలంక క్రికెట్‌కు రూ.188 కోట్ల నష్టం

- మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్యం కోల్పోవడంతో భారీగా ఆదాయానికి గండి

**కొలంబో:** వచ్చే ఏడాది జరగనున్న తొలి ఐసీసీ మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్య హక్కులను కోల్పోవడంతో శ్రీలంక క్రికెట్ (ఎస్‌ఎల్‌సీ)కు సుమారు 20 మిలియన్ డాలర్ల (రూ.188 కోట్లు) ఆదాయం కోల్పోయే అవకాశం ఉంది. తొలుత శ్రీలంకలో జరగాల్సిన ఈ టోర్నీని ఐసీసీ భారత్‌కు తరలించింది. 2027 ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు ముంబయి, వడోదరలో మ్యాచ్‌లు జరగనున్నాయి. ఎస్‌ఎల్‌సీలో ప్రభుత్వ జోక్యం, ఎన్నికైన పాలకవర్గం లేకపోవడాన్ని కారణాలుగా చూపుతూ ఐసీసీ టోర్నీని శ్రీలంక నుంచి తరలించింది. ఆతిథ్య రుసుముగా సుమారు 2 మిలియన్ డాలర్లు అందే అవకాశం ఉన్నప్పటికీ.. వేదికలు, మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఎస్‌ఎల్‌సీ ఖర్చు చేయాల్సి వచ్చేదని ఆ సంస్థ ప్రతినిధి ప్రకాశ్ షాఫ్టర్ తెలిపారు.

### 2024 తర్వాత రెండో ఐసీసీ ఈవెంట్

ప్రభుత్వ జోక్యం కారణంగా 2024 తర్వాత శ్రీలంక కోల్పోయిన రెండో ఐసీసీ ఈవెంట్ ఇదే. షమ్మీ సిల్వా నేతృత్వంలోని ఎన్నికైన పాలకవర్గం రాజీనామా అనంతరం.. ఈ ఏడాది ఏప్రిల్‌లో శ్రీలంక క్రీడల మంత్రి తాత్కాలిక కమిటీని నియమించారు. అవినీతిని నిర్మూలించే లక్ష్యంతో కొత్త రాజ్యాంగ రూపకల్పనపై ఈ కమిటీ పనిచేస్తోంది.

# హార్దిక్‌కు 'ఏ జట్టులో చోటు

- ఆస్ట్రేలియా–ఏతో వన్డే సిరీస్‌కు ఎంపిక
- ఫిట్‌నెస్ సాధిస్తేనే బరిలోకి.. రుతురాజ్‌కు కెప్టెన్సీ

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా–ఏతో అక్టోబర్‌లో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు భారత సీనియర్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను ఎంపిక చేశారు. అయితే పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తేనే అతడు బరిలోకి దిగుతాడని బీసీసీఐ బుధవారం స్పష్టం చేసింది. క్వాడ్రిసెప్స్ గాయం కారణంగా కొంతకాలంగా ఆటకు దూరంగా ఉన్న హార్దిక్.. చివరిసారిగా గత ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్ తరఫున ఆడాడు. ఆస్ట్రేలియా–ఏ పర్యటనలో భాగంగా సెప్టెంబర్ 22 నుంచి పుదుచ్చేరిలో రెండు బహుళ రోజుల మ్యాచ్‌లు, అక్టోబర్ 6, 9, 11 తేదీల్లో మూడు వన్డేలు జరగనున్నాయి. వన్డే జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్‌గా, దేవదత్ పడిక్కల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. పాదం గాయం నుంచి కోలుకున్న సాయి సుదర్శన్‌కు బహుళ రోజుల మ్యాచ్‌ల జట్టులో వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. ఇదే సమయంలో భారత సీనియర్ జట్టు వెస్టిండీస్‌తో సెప్టెంబర్ 27, 30, అక్టోబర్ 3న మూడు వన్డేలు ఆడనుంది. ఆస్ట్రేలియా–ఏ వన్డే జట్టులో ప్రియాంశ్ ఆర్య, సాయి సుదర్శన్, రజత్ పాటిదార్, కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), నిశాంత్ సింధు, విప్రజ్ నిగమ్, అర్షిన్ కులకర్ణి, అర్షద్ ఖాన్, నమన్ ధీర్, ప్రభ్‌సిమ్రన్ సింగ్, గుర్‌జప్నీత్ సింగ్, యశ్ ఠాకూర్ తదితరులకు చోటు దక్కింది.

# భారత్–కివీస్ సిరీస్‌కు భారీ క్రేజ్!

- రెండు వారాల్లోనే 50వేలు దాటిన టికెట్ల విక్రయాలు
- క్రైస్ట్‌చర్చ్ టీ20కి 75శాతం టికెట్లు అమ్మకం

**ఆక్లాండ్:** భారత్–న్యూజిలాండ్ క్రికెట్ సిరీస్‌కు అభిమానుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. అక్టోబర్ చివర్లో ప్రారంభమయ్యే ఈ పర్యటనకు ఇప్పటికే 50 వేలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు న్యూజిలాండ్ క్రికెట్ (ఎన్‌జెడ్‌సీ) వెల్లడించింది. ఆరు సంవత్సరాల తర్వాత న్యూజిలాండ్‌లో పర్యటించనున్న భారత్.. ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టులు ఆడనుంది. టికెట్ల విక్రయాలు ప్రారంభమైన రెండు వారాల్లోనే పలు మ్యాచ్‌లు హౌస్‌ఫుల్‌కు చేరువయ్యాయి. క్రైస్ట్‌చర్చ్‌లో జరిగే రెండో టీ20కి ఇప్పటికే 75 శాతం టికెట్లు అమ్ముడయ్యాయి. భారత్ పర్యటనకు పెరుగుతున్న ఆదరణతో ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ స్టేడియం ఆరో అంతస్తులోని సీటింగ్‌ను సైతం అందుబాటులోకి తీసుకురావాల్సి వచ్చింది.

# ఫైనల్ వేటలో హర్మన్ సేన!

- నేడు బంగ్లాదేశ్‌తో తొలి సెమీఫైనల్
- బ్యాటింగ్, బౌలింగ్‌లో జోరుమీదున్న భారత్



**దుబాయ్:** మహిళల ఆసియా కప్‌లో ఏడుసార్లు చాంపియన్ భారత్.. గురువారం బంగ్లాదేశ్‌తో తొలి సెమీఫైనల్లో తలపడనుంది. గ్రూప్–ఏలో అన్ని మ్యాచ్‌ల్లోనూ గెలిచిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం ఫైనల్ బెర్త్‌కు ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. మ్యాచ్ రాత్రి 8 గంటలకు ప్రారంభమవుతుంది. స్మృతి మంధాన, షెఫాలీ వర్మ, హర్మన్‌ప్రీత్, రిచా ఘోష్‌లతో భారత బ్యాటింగ్ పటిష్ఠంగా ఉంది. హాంకాంగ్‌పై 64 బంతుల్లో 124 పరుగులు చేసిన మంధాన మంచి ఫామ్‌లో ఉండగా.. షెఫాలీ పవర్‌ప్లేలో దూకుడుగా ఆడుతోంది. పాకిస్థాన్‌ను 55 పరుగులకే ఆలౌట్ చేసి ఏడు వికెట్ల తేడాతో గెలవడం భారత్ జోరుకు నిదర్శనం. బౌలింగ్‌లో దీప్తి శర్మ, రాధా యాదవ్, శ్రీచరణి స్పిన్ త్రయంతో పాటు రేణుకా సింగ్ కీలకంగా ఉన్నారు. మహిళల టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డు సృష్టించిన దీప్తిపై భారీ అంచనాలున్నాయి. మరోవైపు నిగార్ సుల్తానా నేతృత్వంలోని బంగ్లాదేశ్.. యూఏఈపై 34 పరుగుల విజయంతో సెమీస్‌కు చేరింది. అయితే 55 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోవడం ఆ జట్టు బ్యాటింగ్ బలహీనతను చాటింది. భారత్‌ను నిలువరించాలంటే రబేయా ఖాన్, నహిదా అక్తర్, మారుఫా అక్తర్ వంటి బౌలర్లు రాణించాల్సి ఉంటుంది. భారత్ ఇప్పటివరకు ఏడుసార్లు ఆసియా కప్ విజేతగా నిలవగా.. శ్రీలంక, బంగ్లాదేశ్ ఒక్కోసారి టైటిల్ సాధించాయి. శ్రీలంక ప్రస్తుత ఛాంపియన్‌గా ఉంది.

# ఫొగాట్‌కు ట్రయల్స్ అవకాశం దక్కేనా?

- మాతృత్వ విరామాన్ని పరిగణనలోకి తీసుకోవాలంటూ పిటిషన్
- డబ్ల్యూఎఫ్ఐ స్పందన కోరిన ఢిల్లీ హైకోర్టు



**న్యూఢిల్లీ:** ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్–2026 మహిళల ఎంపిక ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతించాలని కోరుతూ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు డబ్ల్యూఎఫ్ఐ (రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) స్పందన కోరింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలను తెలుసుకుని గురువారం కోర్టుకు తెలియజేయాలని జస్టిస్ స్వర్ణకాంత శర్మ డబ్ల్యూఎఫ్ఐ న్యాయవాదిని ఆదేశించారు. కజకిస్థాన్‌లోని అస్తానాలో అక్టోబర్ 24 నుంచి నవంబర్ 1 వరకు సీనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్ జరగనుండగా.. సెప్టెంబర్ 14న ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో భారత జట్టు ఎంపిక ట్రయల్స్ నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 7న డబ్ల్యూఎఫ్ఐ జారీ చేసిన అర్హత నిబంధనల సర్క్యులర్‌ను నిలిపివేయాలని కూడా ఫొగాట్ కోర్టును కోరారు. ప్రసవం తర్వాత క్రీడల్లోకి తిరిగి వచ్చే మహిళా క్రీడాకారిణులకు ప్రత్యేకమైన, పారదర్శకమైన విధానం అవసరమని ఫొగాట్ పేర్కొన్నారు. మాతృత్వం కారణంగా అర్హత పోటీలకు దూరమైన వారికి ప్రత్యామ్నాయ అవకాశం ప్రస్తుత నిబంధనల్లో లేదని తెలిపారు. తాను క్రీడా సామర్థ్యం లేకపోవడం వల్ల కాకుండా, మాతృత్వ విరామం కారణంగా నిర్దేశిత పోటీల్లో పాల్గొనలేకపోయినందునే ట్రయల్స్‌కు దూరమవుతున్నానని ఆమె వాదించారు. ఫొగాట్ 2025 జూలైలో తల్లి అయ్యారు. ఇదిలా ఉండగా, మే 9, జూన్ 17న డబ్ల్యూఎఫ్ఐ జారీ చేసిన రెండు షోకాజ్ నోటీసులు, వాటిపై చేపట్టిన క్రమశిక్షణ చర్యలను రద్దు చేయాలని కోరుతూ ఫొగాట్ మరో పిటిషన్ కూడా దాఖలు చేశారు. ఇవి తన పునరాగమనాన్ని అడ్డుకునే చర్యలేనని ఆమె ఆరోపించారు.



## Business
## బిజినెస్

# ఈ20కి మించి ఇథనాల్ కలయికకు కసరత్తు

- ఫ్లెక్సీ–ఫ్యూయల్ వాహనాల రాకతో పెంపునకు సన్నాహాలు
- డీజిల్‌లోనూ బయోఫ్యూయల్స్ వినియోగంపై పరిశీలన
- ప్రధాని సలహాదారు తరుణ్ కపూర్



**న్యూఢిల్లీ:** పెట్రోల్‌లో ప్రస్తుతం అమలవుతున్న 20 శాతం ఇథనాల్ కలయిక (ఈ20)ను మరింత పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని ప్రధాని సలహాదారు తరుణ్ కపూర్ తెలిపారు. ఫ్లెక్సీ–ఫ్యూయల్ వాహనాలు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో ఈ20కి మించి ఇథనాల్ కలిపేందుకు అనుమతించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు 'ఇండియా షుగర్ అండ్ బయో–ఎనర్జీ కాన్ఫరెన్స్–2026'లో వర్చువల్‌గా చెప్పారు. ఇథనాల్ కలయిక కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని, పలు ఆటోమొబైల్ సంస్థలు త్వరలో ఫ్లెక్సీ–ఫ్యూయల్ వాహనాలను తీసుకురానున్నాయని కపూర్ పేర్కొన్నారు. వీటి వినియోగం పెరిగితే పెట్రోల్ బంకుల్లో స్వచ్ఛమైన ఇథనాల్ లభ్యతను కూడా విస్తరించాల్సి ఉంటుందన్నారు. పశ్చిమాసియా సంక్షోభంతో ముడిచమురు ధరలు బ్యారెల్‌కు దాదాపు 100 డాలర్లకు చేరిన నేపథ్యంలో బయోఫ్యూయల్స్ ప్రాధాన్యం పెరిగిందని చెప్పారు. దేశీయ ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం కలయిక అవసరాలను మించిపోయినందున అదనపు ఉత్పత్తిని వినియోగించేందుకు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలిపారు. డీజిల్‌లో బయోఫ్యూయల్ ఆధారిత సంకలనాల వినియోగంపైనా పరిశీలన జరుగుతోందన్నారు. ఐసోబ్యూటనాల్ ప్రయోగాలు విజయవంతమైతే బయోఫ్యూయల్స్‌కు భారీ మార్కెట్ ఏర్పడే అవకాశం ఉందని, గోబర్ధన్ పథకం కింద కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ)తోపాటు పొటాష్ వంటి విలువ ఆధారిత ఉప ఉత్పత్తులపై ఇథనాల్ తయారీదారులు దృష్టి సారించాలని సూచించారు.

# మూడునెలల కనిష్ఠానికి సెన్సెక్స్

- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో భారీ అమ్మకాలు
- 813 పాయింట్లు పతనం.. 23,450 దిగువకు నిఫ్టీ
- 100 డాలర్లు దాటిన ముడిచమురు ధర



**ముంబై:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రతరం కావడం, ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లు దాటడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు నష్టాల్లో ముగిశాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఆర్థిక సేవలు, చమురు–గ్యాస్ షేర్లలో భారీ అమ్మకాలతో సెన్సెక్స్ 813 పాయింట్లు పతనమై దాదాపు మూడు నెలల కనిష్ఠానికి చేరింది. 30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 813.35 పాయింట్లు, 1.08 శాతం నష్టపోయి 74,764.23 వద్ద ముగిసింది. 50 షేర్ల ఎన్ఎస్ఈ నిఫ్టీ 203.60 పాయింట్లు, 0.86 శాతం క్షీణించి 23,431.50 వద్ద స్థిరపడింది. ఈ స్థాయి జూన్ 11 తర్వాత నిఫ్టీకి కనిష్ఠ ముగింపు. సెన్సెక్స్ కంపెనీల్లో హెచ్‌సీఎల్ టెక్ 4.55 శాతం, ఇన్ఫోసిస్ 4.43 శాతం, టెక్ మహీంద్రా 3.87 శాతం, టీసీఎస్ 2.26 శాతం చొప్పున నష్టపోయాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హిందుస్తాన్ యూనిలీవర్ కూడా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. మరోవైపు అదానీ పోర్ట్స్ 3.67 శాతం లాభపడగా.. టాటా స్టీల్, ట్రెంట్, ఎన్‌టీపీసీ లాభాల్లో ముగిశాయి.

### 100 డాలర్లు దాటిన బ్రెంట్

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ 2.67 శాతం పెరిగి బ్యారెల్‌కు 100.5 డాలర్లకు చేరింది. దీంతో ద్రవ్యోల్బణం, రూపాయి విలువ, దేశ బాహ్య సమతుల్యతపై ఆందోళనలు పెరిగాయని మార్కెట్ నిపుణులు తెలిపారు. ఇండియా వీఐఎక్స్ 6 శాతానికి పైగా పెరగడం కూడా మదుపరుల్లో పెరుగుతున్న అప్రమత్తతను సూచించింది. బీఎస్ఈ ఐటీ సూచీ 3.21 శాతం పతనమైంది. రియల్టీ, ఇన్సూరెన్స్, హౌసింగ్ ఫైనాన్స్, బ్యాంకింగ్ సూచీలు కూడా నష్టపోయాయి. విదేశీ సంస్థాగత మదుపరులు మంగళవారం రూ.123.19 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.

# ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ దూకుడు

- నాలుగు బ్యాంకుల్లో 9.95% వరకు వాటా కొనుగోలుకు ఆర్‌బీఐ అనుమతి
- ఏడాదిలోగా ప్రక్రియ పూర్తిచేయాలని స్పష్టం
- గడువులోగా కొనకపోతే అనుమతి రద్దు

**న్యూఢిల్లీ:** నాలుగు బ్యాంకుల్లో 9.95 శాతం వరకు వాటా పెంచుకునేందుకు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీకి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అనుమతి ఇచ్చింది. కోటక్ మహీంద్రా బ్యాంక్, సీఎస్‌బీ బ్యాంక్, డీసీబీ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లలో ఈ వాటా కొనుగోలుకు అనుమతులు లభిం చినట్లు ఐసీఐసీఐ బ్యాంక్ నియంత్రణ సంస్థలకు వెల్లడించింది. సెప్టెంబర్ 8న జారీ చేసిన వేర్వేరు లేఖల ద్వారా ఆర్‌బీఐ అనుమతులు మంజూరు చేసింది. ఆయా బ్యాంకుల చెల్లించిన షేర్ మూలధనం లేదా ఓటింగ్ హక్కుల్లో గరిష్ఠంగా 9.95 శాతం వరకు వాటాను కొనుగోలు చేయవచ్చు. ఆర్‌బీఐ అనుమతి పొందిన తేదీ నుంచి ఏడాదిలోగా వాటా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. నిర్ణీత గడువులోగా కొనుగోలు చేయకపోతే అనుమతులు రద్దవుతాయని పేర్కొంది.

# ఒకే వేదికపై పూర్తి ఆర్థిక వివరాలు

- పెన్షన్‌బజార్ 'వెల్త్ 360' ప్రారంభం

**గురుగ్రామ్:** పెన్షన్‌బజార్ 'వెల్త్ 360' పేరుతో సమీకృత పోర్ట్‌ఫోలియో ట్రాకింగ్ వేదికను ప్రారంభించింది. వినియోగదారుల అనుమతితో బ్యాంకు ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్లు, షేర్లు, ఎన్‌పీఎస్‌లోని పెట్టుబడులు, పొదుపులను ఒకే డ్యాష్‌బోర్డ్‌లో చూపిస్తుంది. మొత్తం పోర్ట్‌ఫోలియో విలువ, పెట్టుబడి చేసిన మొత్తం, లాభనష్టాలు, వివిధ ఆస్తుల్లో పెట్టుబ డుల కేటాయింపును ఒకేచోట తెలుసుకునే అవకాశం కల్పిస్తోంది. దీంతో వేర్వేరు యాప్‌లు, సంస్థల్లో ఉన్న పెట్టుబడులను నిర్వహించడం సులభమవు తుందని సంస్థ తెలిపింది. ఎన్‌పీఎస్‌ను ఇతర పెట్టుబడులతో కలిపి చూపించడం ద్వారా మొత్తం సంపదలో రిటైర్మెంట్ పొదుపుల స్థితిని అంచనా వేసుకోవచ్చని పేర్కొంది.

# ప్లానెట్ యాప్‌లో ఏజెంటిక్ కామర్స్

- పైన్ ల్యాబ్స్‌తో ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ భాగస్వామ్యం
- ఏఐ ఏజెంట్‌తో విమాన టికెట్ల బుకింగ్, యూపీఐ చెల్లింపులు

L&T Finance

**ముంబై:** ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎల్‌టీఎఫ్) తన 'ప్లానెట్' యాప్‌లో ఏజెంటిక్ కామర్స్, చెల్లింపుల సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి పైన్ ల్యాబ్స్‌తో భాగస్వామ్యం చేసుకుంది. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్–2026లో ఈ భాగస్వామ్యాన్ని ప్రకటించారు. పైన్ ల్యాబ్స్ పేమెంట్స్ ప్రోటోకాల్ (పీ3పీ), గ్రాంటెక్స్ ప్రోటోకాల్ ఆధారంగా ఈ సేవలు పనిచేయనున్నాయి. తొలి సేవగా విమాన టికెట్ల బుకింగ్‌ను ప్రవేశపెట్టనున్నారు. కస్టమర్ తన ప్రయాణ వివరాలు, బడ్జెట్‌ను ఏఐ ఏజెంట్‌కు తెలియజేస్తే.. అందుకు అనుగుణంగా విమానాలను వెతికి, ఎంపిక చేసి బుకింగ్‌ను పూర్తి చేస్తుంది. బయ్యర్ ఏజెంట్ ధరలు, విమాన వివరాలను పరిశీలించి కొనుగోలు చేయగా.. విక్రేత ఏజెంట్ విమానయాన సంస్థల వ్యవస్థల నుంచి రియల్‌టైమ్ సీట్లు, ఛార్జీలు, బుకింగ్ వివరాలను అందిస్తుంది. అనంతరం ప్లానెట్ యాప్‌లోని యూపీఐ ద్వారా చెల్లింపు పూర్తవుతుంది. వినియోగదారులు నిర్దేశించిన పరిమితుల్లోనే లావాదేవీలు జరిగేలా వ్యవస్థను రూపొందించారు. గుర్తింపు ధ్రువీకరణ, ఖర్చు పరిమితులు, లావాదేవీల పర్యవేక్షణ, ఆడిట్‌ను గ్రాంటెక్స్ ప్రోటోకాల్ నిర్వహిస్తుంది. భవిష్యత్తులో విమాన టికెట్లతోపాటు మరిన్ని వ్యాపార విభాగాలకు ఈ సేవలను విస్తరించనున్నట్లు సంస్థలు తెలిపాయి.

# ప్రపంచ టాప్-3లో అదానీ ఎయిర్‌పోర్ట్స్!

- 100 కోట్ల డాలర్ల కొత్త ఈక్విటీ సమీకరణ
- 1,900 కోట్ల డాలర్లకు చేరిన సంస్థ విలువ
- 20 కోట్ల వార్షిక ప్రయాణికుల సామర్థ్యమే లక్ష్యం




**న్యూఢిల్లీ:** గౌతమ్ అదానీకి చెందిన అదానీ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్ ప్రపంచంలోనే అత్యంత విలువైన విమానాశ్రయ ఆపరేటర్లలో ఒకటిగా అవతరించనుంది. టెమాసెక్, బ్లాక్‌రాక్ ఫండ్లు, ఆల్ఫా వేవ్ గ్లోబల్, ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ తదితర గ్లోబల్, దేశీయ ఇన్వెస్టర్ల నుంచి సంస్థ సుమారు 100 కోట్ల డాలర్ల కొత్త ఈక్విటీని సమీకరించింది. దీంతో సంస్థ ఈక్విటీ విలువ సుమారు 1,900 కోట్ల డాలర్లకు చేరనుంది. ఈ విలువతో అదానీ ఎయిర్‌పోర్ట్స్ ప్రపంచంలో మూడో అత్యంత విలువైన విమానాశ్రయ ఆపరేటర్‌గా నిలిచే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. స్పెయిన్‌కు చెందిన ఏనా, ఎయిర్‌పోర్ట్స్ ఆఫ్ థాయ్‌లాండ్ మాత్రమే ముందున్నాయి. అయితే అవి స్టాక్ మార్కెట్లో నమోదైన సంస్థలు కాగా.. అదానీ ఎయిర్‌పోర్ట్స్ ప్రైవేటు సంస్థ కావడంతో పోలిక పూర్తిగా సమానమైనది కాదని పేర్కొన్నారు. ఇన్వెస్టర్ కన్సార్టియం మూడు విడతల్లో కొత్తగా జారీ చేసే షేర్లను కొనుగోలు చేసి మొత్తం 5.54 శాతం వాటాను దక్కించుకోనుంది. చివరి విడత పెట్టుబడి 2027 జూలై నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. సమీకరించిన నిధులను విమానాశ్రయాల విస్తరణ, ఆధునికీకరణ, అనుబంధ వాణిజ్య మౌలిక సదుపాయాలు, గ్రౌండ్ హ్యాండ్లింగ్, ప్రయాణికుల సేవల విస్తరణకు వినియోగించనున్నారు. వార్షిక ప్రయాణికుల సామర్థ్యాన్ని 20 కోట్లకు పెంచాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు ఎనిమిది విమానాశ్రయాలను అదానీ ఎయిర్‌పోర్ట్స్ నిర్వహిస్తోంది. దేశీయ ప్రయాణికుల రాకపోకల్లో సుమారు 25 శాతం, ఎయిర్‌కార్గోలో మూడో వంతు వాటా కలిగి ఉంది. తొలి దశలో విమానాశ్రయ నగరాల అభివృద్ధిలో 2.2 కోట్ల చదరపు అడుగుల మిశ్రమ ప్రాజెక్టులను చేపట్టనుంది. తాజా నిధుల సమీకరణ తర్వాత కూడా అదానీ ఎంటర్‌ప్రైజెస్ నియంత్రణ కొనసాగుతుంది.

# అనుపమ మాస్ ధమాకా.. 'క్రేజీ కళ్యాణం'లో పెళ్లి సందడి షురూ!



యంగ్ అండ్ గ్లామరస్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్, విలక్షణ నటుడు–దర్శకుడు తరుణ్ భాస్కర్, అఖిల్ రాజ్, సీనియర్ నటుడు నరేష్ వీకే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న లేటెస్ట్ క్రేజీ మూవీ 'క్రేజీ కళ్యాణం'. బద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత బూసమ్ జగన్ మోహన్ రెడ్డి అరోస్ సినిమాస్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ సంస్థ నుంచి వస్తున్న రెండో ప్రాజెక్ట్ కావడంతో సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇక ఇప్పటివరకు గ్లామరస్ పాత్రల్లో మెప్పించిన అనుపమ.. ఈ సినిమాలో మాత్రం పక్కా తెలంగాణ పల్లెటూరి అమ్మాయిగా సరికొత్త అవతార్‌లో కనిపించబోతోంది. తెలంగాణ యాస, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా తెరకెక్కుతున్న ఈ సినిమా పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. పెళ్లి సందడి, తండ్రీకూతుళ్ల మధ్య జరిగే సరదా సన్నివేశాలు, తెలంగాణ పల్లె వాతావరణం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా కొనసాగుతుండగా.. తాజాగా మేకర్స్ సినిమా మ్యూజికల్ జర్నీని గ్రాండ్‌గా ప్రారంభించారు. ఇందులో భాగంగా 'కాకా దూమ్ దామ్ ధమాకా' అనే ఊరమాస్ సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. ప్రోమో చూస్తుంటేనే పాట ఏ రేంజ్‌లో మాస్ ట్రీట్ ఇవ్వబోతుందో అర్థమవుతోంది. పెళ్లి వేడుక నేపథ్యంలో సాగిన ఈ ప్రోమోలో అనుపమ పక్కా పెళ్లికూతురు గెటప్‌లో కనిపిస్తూ మాస్ స్టెప్పులతో అదరగొట్టింది. పూనకం వచ్చినట్టుగా అనుపమ వేసిన ఎనర్జిటిక్ స్టెప్పులు ప్రోమోకు మెయిన్ హైలైట్‌గా నిలిచాయి. ఆమె డ్యాన్స్ చూసి పక్కనే ఉన్న తరుణ్ భాస్కర్ మొదట షాక్‌కు గురైనప్పటికీ.. ఆ తర్వాత తాను కూడా పాటలోని బీట్‌కు తగ్గట్టుగా స్టెప్పులు వేస్తూ ఎంజాయ్ చేయడం మరింత ఫన్ క్రియేట్ చేసింది. దీంతో ప్రోమో విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో ఈ సాంగ్‌పై ఆసక్తి పెరిగింది. టాలెంటెడ్ లిరిసిస్ట్ కాసర్ల శ్యామ్ ఈ ఊరమాస్ పాటకు సాహిత్యం అందించగా.. సురేష్ బొబ్బిలి తనదైన స్టైల్‌లో అదిరిపోయే మాస్ బీట్స్‌ను అందించారు. ఇటీవల 'ఏషనాగుల కట్టమీద' పాటతో సోషల్ మీడియాలో సందడి చేసిన జంగి రెడ్డి ఈ పాటను ఆలపించారు. జంగి రెడ్డి పవర్‌ఫుల్ వాయిస్‌కు సురేష్ బొబ్బిలి మాస్ బీట్స్ తోడవడంతో 'కాకా దూమ్ దామ్ ధమాకా' నెక్స్ట్ లెవెల్ ఎనర్జీతో ఉందంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇక ప్రోమోతోనే ఇంత హైప్ క్రియేట్ చేసిన ఈ ఊరమాస్ సాంగ్ ఫుల్ వెర్షన్‌ను సెప్టెంబర్ 12న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. మరి ఫుల్ సాంగ్ ఏ రేంజ్‌లో దుమ్మురేపుతుందో చూడాలి!

# సిగ్మాపై ఫరియా హైప్



'జాతిరత్నాలు'లో చిట్టిగా తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న గ్లామరస్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా.. ఇప్పుడు కోలీవుడ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అయింది. తొలి సినిమాతోనే తన కామెడీ టైమింగ్, అందంతో ఆకట్టుకున్న ఈ భామ ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించినా ఆశించిన స్థాయిలో భారీ బ్లాక్‌బస్టర్‌ను అందుకోలేకపోయింది. దీంతో ఇప్పుడు తమిళ ఇండస్ట్రీపై ఫోకస్ పెట్టిన ఫరియా.. స్టార్ హీరో విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న క్రేజీ ప్రాజెక్ట్ 'సిగ్మా'లో హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాతో జాసన్ సంజయ్ దర్శకుడిగా ఎంట్రీ ఇస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై గ్రాండ్ స్కేల్‌లో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో యంగ్ హీరో సందీప్ కిషన్, సీనియర్ నటి రమ్యకృష్ణ, సంపత్ రాజ్, రాజ్ సుందరం కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్ రిలీజ్‌కు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే ప్రమోషన్స్‌ను జోరుగా నిర్వహిస్తున్న చిత్రబృందం తాజాగా టైటిల్ సాంగ్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా జరిగిన ఈవెంట్‌లో ఫరియా అబ్దుల్లా 'సిగ్మా' గురించి, దర్శకుడు జాసన్ సంజయ్ గురించి చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్‌గా మారుతున్నాయి. 'సిగ్మా' తనకు చాలా స్పెషల్ మూవీ అని ఫరియా చెప్పింది. భారీ ప్రాజెక్ట్ కావడంతో పాటు ఇది తన తొలి కోలీవుడ్ సినిమా కావడం తనకు ఎంతో ఎగ్జైటింగ్‌గా ఉందని తెలిపింది. ముఖ్యంగా దర్శకుడు జాసన్ సంజయ్‌పై ఫరియా ప్రశంసల వర్షం కురిపించింది. సినిమా మేకింగ్ విషయంలో జాసన్‌కు చాలా క్లారిటీ ఉందని, కథ విషయంలో తాను ఏం చెప్పాలనుకుంటున్నాడో ఆయనకు చాలా స్పష్టమైన విజన్ ఉందని చెప్పింది. సినిమాపై ఆయన చూపిస్తున్న డెడికేషన్, ప్యాషన్ చూస్తుంటే నిజంగా స్ఫూర్తి కలుగుతుందని ఫరియా పేర్కొంది. అంతేకాదు.. జాసన్ తెరకెక్కిస్తున్న 'సిగ్మా' ఖచ్చితంగా ప్రేక్షకులను మెప్పిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేసింది. దీంతో ఫరియా చేసిన ఈ వ్యాఖ్యలు సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి. తొలి సినిమాతోనే దర్శకుడిగా జాసన్ ఎలాంటి ఇంపాక్ట్ క్రియేట్ చేయబోతున్నాడో చూడాలంటే అక్టోబర్ 2 వరకు వేచి చూడాల్సిందే!

# 'ఎప్పుడూ ఎవరో ఒకరు గమనిస్తూనే ఉంటారు.. అదే ఒక రకమైన హింస

తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్న యంగ్ బ్యూటీ కాయదు లోహర్.. మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమవుతోంది. 'ఇమ్మోర్టల్', 'ఐయామ్ గేమ్' చిత్రాల తర్వాత టాలెంటెడ్ డైరెక్టర్ మారి సెల్వరాజ్ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న 'మంజనత్తి' సినిమాలో ఆమె కీలక పాత్రకు ఎంపికైంది. ప్రియాంక మోహన్, పూర్ణిమ రవి, కదిర్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే లాంఛనంగా ప్రారంభమైంది. ఇదిలా ఉంటే.. తాజాగా కాయదు లోహర్ చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. మనుషులను ఎప్పుడూ ఎవరో ఒకరు గమనిస్తూ ఉండటంలోనే ఒక రకమైన హింస దాగి ఉంటుందని ఆమె పేర్కొంది. అది కోపంతో చేసే హింస కాకపోయినా.. మాట్లాడకుండా నిరంతరం కనిపెట్టుకుని చూడటం కూడా ఒక విధమైన హింసేనని చెప్పుకొచ్చింది. మనం ఎలా జీవించాలో సమాజం కొన్ని కనిపించని నియమాలను ఏర్పాటు చేసి, వాటి ఆధారంగా మన జీవితాలను కొలుస్తూ ఉంటుందని.. అణచివేత కూడా ఇలాగే కొనసాగుతుందని కాయదు అభిప్రాయపడింది. ఎవరినైనా బలవంతంగా లొంగదీయాల్సిన అవసరం లేదని, లొంగి ఉంటేనే భద్రత లభిస్తుందని నమ్మించగలిగితే అదే అణచివేతను కొనసాగించడానికి సరిపోతుందని చెప్పింది. అయితే అలాంటి పరిస్థితుల్లో నిజమైన భద్రత ఎప్పటికీ దొరకదని, ఎందుకంటే ఎప్పుడూ మరో కొత్త గది, మరో కొత్త చూపు, దాటకూడదనే మరో హద్దు ఎదురవుతూనే ఉంటుందని పేర్కొంది. చివరికి ఒకరోజు.. ప్రతిరోజూ భయపడే, అడగకూడదని అనుకునే ప్రశ్నను ఆమె ధైర్యంగా అడుగుతుందని.. బహుశా ఆ క్షణం నుంచే ఈ ప్రపంచం తన అసలు నిజాన్ని తానే బయటపెట్టుకోవడం మొదలుపెడుతుందని కాయదు రాసుకొచ్చింది. ఈ పోస్ట్ 'మంజనత్తి' కథకు ఏదైనా సంబంధం ఉందా? సినిమాలో ఆమె పోషిస్తున్న పాత్ర ఎలాంటి పరిస్థితుల్లో ప్రయాణించబోతోంది? అనే ఆసక్తి ఇప్పుడు ప్రేక్షకుల్లో మొదలైంది. మరోవైపు 'మంజనత్తి'లో భాగం కావడంపై కూడా కాయదు స్పందించింది. మారి సెల్వరాజ్, ఇళయరాజా వంటి పరిశ్రమలోని అత్యుత్తమ ప్రతిభావంతులతో కలిసి ఈ ప్రయాణంలో భాగం కావడం తనకు ఎంతో ఉత్తేజంగా ఉందని చెప్పింది. నిజాయితీగా చెప్పాలంటే ఈ అవకాశం తనకు ఒక ఆశీర్వాదంలా అనిపిస్తోందని పేర్కొన్న కాయదు.. కృతజ్ఞతతో, ఉత్సాహంతో ఈ ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు ఎంతో గౌరవంగా భావిస్తున్నానని తెలిపింది. ఆమె చేసిన ఈ వ్యాఖ్యలతో 'మంజనత్తి'పై అంచనాలు మరింత పెరగడంతో పాటు.. ఈ సినిమా ద్వారా మారి సెల్వరాజ్ ఎలాంటి కథను చెప్పబోతున్నారనే ఆసక్తి కూడా నెలకొంది.




## 'ఫౌజీ' షూటింగ్‌కు తాత్కాలిక బ్రేక్.. మిగిలింది 20 రోజులే!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న మోస్ట్ అవైటెడ్ పీరియాడిక్ వార్ డ్రామా 'ఫౌజీ'పై మరో ఆసక్తికరమైన అప్డేట్ ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌కు తాత్కాలికంగా బ్రేక్ ఇచ్చినట్లు సమాచారం. ప్రభాస్‌కు సంబంధించిన షూటింగ్ ఇంకా సుమారు 20 రోజులు మాత్రమే పెండింగ్‌లో ఉండగా.. వరుస చిత్రాల షూటింగ్స్‌లో పాల్గొంటున్న కారణంగా ఆయనకు కొంత విరామం ఇచ్చి 'ఫౌజీ' షూటింగ్‌ను సెప్టెంబర్ 15 వరకు నిలిపివేసినట్లు తెలుస్తోంది. అయితే షూటింగ్‌కు బ్రేక్ పడినా.. సినిమా పనులు మాత్రం ఏమాత్రం ఆగలేదు. ఇప్పటికే పోస్ట్‌ప్రొడక్షన్ పనులు శరవేగంగా కొనసాగుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా సినిమాలోని భారీ యాక్షన్ సన్నివేశాలకు సంబంధించిన విజువల్ ఎఫెక్ట్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిన మేకర్స్.. అమెరికాకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ వీఎఫ్ఎక్స్ సంస్థలతో కలిసి పనిచేస్తున్నారట. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో విజువల్ వండర్‌గా ఆవిష్కరించేందుకు నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 'ఫౌజీ'పై ప్రభాస్ అభిమానుల్లోనే కాకుండా సినీ ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో.. సినిమా నుంచి వచ్చే ప్రతి అప్డేట్ ఆసక్తిని పెంచుతోంది.

# ఆ సినిమా తర్వాత నాకు అవకాశాలే రాలేదు



కోలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ బ్యూటీ ఐశ్వర్య లక్ష్మి ఇటీవల 'గట్టకుస్తీ–2'తో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం తెలుగులో సాయి దుర్గా తేజ్ సరసన 'సంబరాల ఏటిగట్టు' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఐశ్వర్య లక్ష్మి తన కెరీర్‌లో ఎదుర్కొన్న చేదు అనుభవాలను గుర్తుచేసుకుంటూ తీవ్ర భావోద్వేగానికి లోనైంది. ముఖ్యంగా 2023లో దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన 'కింగ్ ఆఫ్ కోథా' సినిమా విడుదల తర్వాత తనపై వచ్చిన ట్రోలింగ్ తనను తీవ్రంగా బాధించిందని ఆమె వెల్లడించింది. ఆ సినిమాలో తన నటనపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున నెగెటివ్ కామెంట్స్, ట్రోల్స్ రావడం తన వ్యక్తిగత జీవితంపైనా, కెరీర్‌పైనా గట్టిగానే ప్రభావం చూపిందని ఐశ్వర్య చెప్పింది. ఆ సినిమా తర్వాత మలయాళ చిత్ర పరిశ్రమలో తనకు అవకాశాలు ఇవ్వడానికి నిర్మాతలు, దర్శకులు కూడా వెనుకడుగు వేసినట్లు అనిపించిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఒక సినిమా ఫలితం, దానిపై వచ్చిన విమర్శలు ఓ నటుడి కెరీర్‌ను ఎంతగా ప్రభావితం చేస్తాయో ఆ సమయంలో ప్రత్యక్షంగా అనుభవించానని చెప్పిన ఐశ్వర్య.. ఆ దశ తనకు ఎంతో కఠినంగా గడిచిందని పేర్కొంది. అయితే ఆ కష్టాల నుంచి బయటపడి ప్రస్తుతం వరుస అవకాశాలతో ముందుకు సాగుతున్న ఈ భామ.. 'గట్టకుస్తీ–2' విజయంతో మళ్లీ సక్సెస్ ట్రాక్‌లోకి రావడంతో పాటు, 'సంబరాల ఏటిగట్టు'తో తెలుగు ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమవుతోంది. దీంతో ఈ మూవీతో ఐశ్వర్య లక్ష్మి టాలీవుడ్‌లో ఎలాంటి గుర్తింపు అందుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

## 'ఎపిక్'పై ట్రోల్స్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన నాగవంశీ!



ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా ఆదిత్య హాసన్ తెరకెక్కించిన 'ఎపిక్: ఫస్ట్ సెమిస్టర్' సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాకు సెన్సార్ 'ఏ' సర్టిఫికెట్ రావడంతో పాటు ట్రైలర్‌లోని రొమాంటిక్ సీన్లపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరుగుతోంది. దీనిపై నిర్మాత నాగవంశీ ఘాటుగా స్పందించారు. కేవలం కొన్ని ముద్దు సన్నివేశాలు చూసి సినిమాను అడల్ట్ ఫిల్మ్‌గా ముద్ర వేయడం సరికాదన్నారు. అసలు సినిమా చూడకుండానే కొందరు కావాలనే నెగెటివిటీ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 'ఎపిక్' కేవలం రొమాన్స్ చుట్టూ తిరిగే సినిమా కాదని, నేటి యువత ఆలోచనలు, భావోద్వేగాలను ప్రతిబింబించే కథ అని తెలిపారు. కథకు అవసరమైన కొన్ని రొమాంటిక్ సన్నివేశాలు ఉన్నంత మాత్రాన సినిమా మొత్తం అలానే ఉంటుందని భావించొద్దని చెప్పారు. ఇది యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్ కూడా ఎంజాయ్ చేసే ప్రేమకథా చిత్రమని నాగవంశీ స్పష్టం చేశారు.

# శ్రీమతిగా నివేదా థామస్ సరికొత్త అవతార్!



టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ బ్యూటీ నివేదా థామస్ సెకండ్ ఇన్నింగ్స్‌లో వరుసగా విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనదైన నటనతో ఆకట్టుకుంటోంది. 2024లో విడుదలైన '35 చిన్న కథ కాదు' చిత్రంలో అద్భుతమైన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకోవడంతో పాటు పలు అవార్డులను సైతం సొంతం చేసుకుంది. అయితే ఆ వార్తలకు చెక్ పెడుతూ.. దాదాపు రెండేళ్ల గ్యాప్ తర్వాత సరికొత్త కథతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. తాజాగా నివేదా ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న కొత్త సినిమాను అధికారికంగా ప్రకటించిన మేకర్స్.. ఈ చిత్రానికి 'శ్రీమతి' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. మూవీ అనౌన్స్‌మెంట్‌తో పాటు నివేదా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో పక్కా ఇల్లాలిగా కనిపిస్తున్న నివేదా.. నడుముపై చేయి వేసుకుని కిచెన్‌లో నిల్చున్న తీరు ఆకట్టుకుంటోంది. ఆమె చుట్టూ గరిటె, కాఫీ కప్, గ్యాస్ స్టవ్, వంట పాత్రలు కనిపించడంతో ఈ సినిమా కథ ఏ నేపథ్యంలో సాగనుందో ఆసక్తిని పెంచుతోంది. 'ప్రతి ఇంటి హృదయం నుంచీ ఒక కథ ఉద్భవిస్తుంది.. అది మనందరికీ తెలిసిన, మనం ప్రేమించే.. మనం జీవించే కథ' అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై క్యూరియాసిటీ ని మరింత పెంచుతోంది. కిచెన్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ కథలో ఓ సగటు ఇల్లాలు జీవితంలో ఎదుర్కొనే భావోద్వేగాలు, కుటుంబ బాధ్యతలు, ఆమె మనసులో దాగి ఉన్న అనుభూతులను ఎంతో సహజంగా ఆవిష్కరించబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు విభిన్న పాత్రలతో మెప్పించిన నివేదా.. 'శ్రీమతి'లో పూర్తిగా కొత్త షేడ్స్‌లో కనిపించబోతుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి నెలకొంది. ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'సతీ లీలావతి'తో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు విశ్వక్ ఖండేరావు దర్శకత్వం వహిస్తున్నారు. టైటిల్, ఫస్ట్ లుక్‌తోనే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ క్రియేట్ చేసిన 'శ్రీమతి'.. నివేదా థామస్ కెరీర్‌లో మరో ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుందేమో చూడాలి.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.